

# భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక







సంపుటి: 3 సంచిక: 305 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు శుక్రవారం, 28 ఆగష్టు 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 305 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR FRIDAY, 28 AUGUST 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI


## నేపాల్ వరద బీభత్సం

# ఏపీ వాసులు ఏడుగురు గల్లంతు

### నేపాల్ వరద బీభత్సం తర్వాత దొరకని జాడ ఫోన్లు స్విచ్ఛాఫ్ కావడంతో కుటుంబాల్లో టెన్షన్ ప్రతికూల వాతావరణంతో కొందరికి అస్వస్థత పరిస్థితిని సమీక్షిస్తున్న మంత్రి లోకేశ్





**అమరావతి, 27 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి బ్యూరో** : నేపాల్ వరద బీభత్సం ఏపీలో కల్లోలం రేపుతోంది. కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తమవారి క్షేమ సమాచారం 24 గంటలుగా దొరక్క, వారి కుటుంబాలు కలత చెందుతున్నాయి. భయపెడుతున్న వరద సమాచారం, ఆ విపత్తు చోటుచేసుకున్న ప్రాంతాల్లోనే ఏపీ యాత్రికులు ఉన్నట్టు తెలుస్తుండటంతో ఏ క్షణాన ఏ కబురు వినాల్సి వస్తోందోనని కలవరపడుతున్నాయి. ఫోన్లు స్విచ్ఛాఫ్‌లు కావడం మరింత టెన్షన్‌కు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. విపత్తులో చిక్కుకున్న రాష్ట్ర వాసుల వివరాలను సేకరించేపనిలో ఆర్టీజీఎస్ అధికారులు మగ్నమయ్యారు. ప్రాథమికంగా అధికారులు సేకరించిన వివరాల మేరకు ఏడుగురు ఏపీ వాసులు గల్లంతయ్యారు. నేపాల్‌లో చిక్కుకున్న ఏపీవాసుల క్షేమ సమాచారంపై మంత్రి లోకేశ్ గురువారం సమీక్ష నిర్వహించారు. గల్లంతైన వారి ఆచూకీ కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సం ప్రదింపులు జరపాలని అధికారులను ఆదేశించారు. కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లి వరదల్లో చిక్కుకున్నా, క్షేమంగానే ఉన్న కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్‌శాస్త్రి సహా అందరినీ రాష్ట్రానికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



**ఎక్కువ మంది ఈశా ఫౌండేషన్ సభ్యులే..**

నేపాల్ వరదల్లో గల్లంతైన తెలుగువారిలో అత్యధికులు ఈశా ఫౌండేషన్ ద్వారా నేపాల్ వెళ్లిన వారే కావడం గమనార్హం. ప్రాథమిక సమాచారం మేరకు, ఈశా ఫౌండేషన్ ద్వారా వెళ్లినవారిలో ఆరుగురు గల్లంత య్యారు. వీరితోపాటు ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాలకు చెం దిన వారు కూడా గల్లంతయినట్లు సమాచారం. ఈశా ఫౌండేషన్ ద్వారా వెళ్లిన వారిలో.. వెన్నెలగంటి బాల సుబ్రమణ్యం, కుప్పం, చిత్తూరు జిల్లా, అట్లూరి శశికుమార్, ఎన్ఆర్ఐ, నిమ్మగడ్డ రాజ్యలక్ష్మి, ఎన్ఆర్ఐ, అన్నందేవర వెంకట్రామ్, కాకినాడ, అన్నందేవర అనగ, కాకినాడ, కాకాని అపర్ణ, గుంటూరు ఉన్నారు. వీరితో పాటు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి చొప్పవరపు రమేశ్ బాబు ఉన్నారు.

**కంట్రోల్ రూం ఏర్పాటు**

నేపాల్‌లో చిక్కుకున్న వారి కోసం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. బాధితుల సమాచారం తెలిసినా, బాధితులు తమ క్షేమ సమాచారాన్ని తెలియజేయాలనుకున్నా 011-23384016, 2338 7089 నంబర్లకు సంప్రదించాలని అధికారులు కోరారు. వాట్సాప్ నంబరు 90598 24101 కూ సంప్రదించవచ్చని కోరారు.

## భార్యపై భర్త ఆధిపత్యం
# చెలాయించడం కుదరదు

- పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య బానిస కాదు
- పెళ్లంటే పరస్పర గౌరవంతో బతికే బంధం
- పనిమనిషిగా చూడాలనుకునే తీరు క్షమార్హం కాదు
- కర్నాటక హైకోర్టు సంచలన వ్యాఖ్యలు




కుటుంబ జీవితంలో భార్యాభర్తలు ఇద్దరూ బాధ్యతలను పరస్పరం పంచుకోవాలని పేర్కొంది. అలాగే వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా వారి సొంత పిల్లలపై ఉంటుందని కోర్టు తెలిపింది. అత్తమామలను చూసుకోవడాన్ని కోడలిపై తప్పనిసరి బాధ్యతగా మోపడం సమంజసం కాదని స్పష్టం చేసింది.

## యథావిధిగా లోక్‌సభ
# నియోజకవర్గాలు




- మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి
- ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
- ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
- తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్

డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు.

# హరీష్‌రావు అరెస్ట్

**హన్మకొండలో బిఆర్ఎస్ ధర్న**
**హరీష్ రావు అరెస్ట్‌తో పోలీస్ స్టేషన్ ముందు బైఠాయింపు**

హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. అలాగే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లాలో జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు.




# జన్‌ధన్ డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లు




- 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను తెరిచిన ప్రజలు
- వివరాలను వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ




# ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు

80 మంది సంస్థ యాత్రికులు వరదల్లో గల్లంతు

కన్నీటి పర్యంతం అయిని జగ్గీవాసుదేవ్

# 288 నేపాల్ వరదలు.. మంది భారతీయులు గల్లంతు

నేపాల్ ఆకస్మిక వరదల్లో 288 మంది భారతీయులు గల్లంతయ్యారని భారత విదేశాంగశాఖ ప్రకటించింది. ఇప్పటివరకు 21 మందిని కాపాడినట్లు తెలిపింది. వీరంతా తమిళనాడుకు చెందినవారని పేర్కొంది. మానస సరోవర యాత్రకు వెళ్లిన పలువురు భారత పౌరులు చైనా వైపు టిబెట్‌లో చిక్కుకుపోయినట్లు తెలిపింది. అక్కడి నుంచి సుమారు 200 మంది సాయం కోసం విజ్ఞప్తి చేశారని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ మీడియా సమావేశంలో చెప్పారు. వరదల నేపథ్యంలో దిల్లీలో ప్రత్యేక కంట్రోల్ ఏర్పాటు చేశామన్నారు.

**చైనా మౌనమే అసలు 'విపత్తు'.. భారత్‌కు ఓ హెచ్చరిక!**

"ఆచూకీ తెలియకుండా పోయిన 288 మంది భారతీయుల్లో త్రిశూలి-1 విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 73 మంది కూడా ఉన్నారు.






# కర్నూలులో హైకోర్టు బెంచ్‌ఏర్పాటు చేయాలి

పత్తికొండలో న్యాయవాదులు విధులు బహిష్కరించి బైక్ ర్యాలీ నిర్వహించారు.

స్థానిక అతిథి గృహం నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు న్యాయవాదులు బైక్‌లతో ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు.



## భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించడం కుదరదు

బెంగళూరు: వివాహ బంధంలో భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య ఇంటి పనులు చేయాలి, అత్తమామలను తప్పనిసరిగా చూసుకోవాలి, పుట్టింటికి వెళ్లాలంటే భర్త అనుమతి తీసుకోవాలనే నిబంధన ఏదీ లేదని పేర్కొంది. వివాహం అంటే పరస్పర గౌరవం, నమ్మకం, సమానత్వంతో కొనసాగాల్సిన బంధమని కోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ చిల్లకూరు సుమలత ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని కోర్టు తన తీర్పులో ప్రస్తావించింది.

బెంగళూరు రూరల్ జిల్లాకు చెందిన సతీష్ అనే వ్యక్తి తన భార్య, కుమార్తెకు కుటుంబ న్యాయస్థానం

నెలకు రూ.9,000 చొప్పున భరణం చెల్లించాలని ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తన తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, తన అనుమతి తీసుకోకుండానే తరచూ పుట్టింటికి వెళ్తోందని అతడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ వాదనలపై కోర్టు తీవ్రంగా స్పందించింది. భర్త చేసిన ఆరోపణలను పరిశీలిస్తే భార్యను కుటుంబ సభ్యురాలిగా కాకుండా ఇంటి పనుల కోసం ఉంచుకున్న వ్యక్తిగా భావిస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. భార్య తన తల్లిదండ్రులను కలవడానికి పుట్టింటికి వెళ్లాలంటే భర్త లేదా అత్తమామల అనుమతి తీసుకోవాలనే ఆలోచనను కోర్టు ప్రశ్నించింది. ఒక మహిళ తన తల్లిదండ్రులను కలవడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భార్య ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలి అనే విషయాలను పూర్తిగా భర్త నియంత్రించడం సరైన పద్ధతి కాదని కోర్టు పేర్కొంది. ఇలాంటి ఆంక్షలు మహిళ వ్యక్తిగత స్వేచ్ఛను దెబ్బతీసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇంటి పనులన్నీ భార్యే చేయాలనే భావన సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. కోడలు అత్తమామలకు సేవ చేయడం ఆమె ఇష్టంతో జరగాలి తప్ప, బలవంతం చేయడం సరికాదని పేర్కొంది. వివాహ బంధం కేవలం కొన్ని ఆచారాలు, సంప్రదాయాలతో ఏర్పడే సంబంధం కాదని కోర్టు పేర్కొంది. భార్యాభర్తల మధ్య ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం, సహకారం ఉండాలని తెలిపింది. లింగం ఆధారంగా మహిళల స్వేచ్ఛను పరిమితం చేయడం రాజ్యాంగం అందించే సమానత్వ సూత్రాలకు విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. భార్య, కుమార్తెకు రోజుకు రూ.150 చొప్పున కూడా భరణం చెల్లించలేనని భర్త చేసిన అభ్యర్థనను కోర్టు కొట్టివేసింది.

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు



న్యూఢిల్లీ:లోక్‌సభ నియోజక వర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయెుద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## జన్‌ధన్ డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లకు చేరాయి. 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను ప్రజలు తెరిచారు. ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. ఇది బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పేర్కొన్నారు. మొత్తం ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, నగర ప్రాంతాల్లో ఉండగా.. అందులో 56 శాతం ఖాతాలు మహిళల పేరిటే ఉండటం విశేషం. ఖాతాదారులకు ఇప్పటివరకూ 41.29 కోట్లకు పైగా రూపే డెబిట్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఖాతాల ద్వారా ఉచిత ప్రమాదబీమా, పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నారు. కనీస మొత్తం లేకుండానే రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ముద్రా రుణాలు అందిస్తున్నారు. జన్ ధన్-ఆధార్-మొబైల్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకే జమ అవుతున్నాయి. 2014 ఆగస్టు 28న ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఖాతాల వల్ల ప్రజలు భద్రంగా డబ్బు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులువు అవుతుంది.



# హరీష్‌రావు అరెస్ట్

వరంగల్: బీఆర్ఎస్ ఎల్పీఉప నేత తన్నీరు హరీష్ రావును హనుమకొండ సుబేదారి లో పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. అలాగే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లాలో జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించారు. అలాగే వరంగల్, హనుమకొండలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.

## కర్నూలులో హైకోర్టు బెంచ్‌ఏర్పాటు చేయాలి



**పత్తికొండ, ఆగస్టు 27 (మన సాక్షి):-**

కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్‌తో పాటు పత్తికొండలో సబ్‌కోర్టును ఏర్పాటు చేయాలని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. మధుబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పత్తికొండలో న్యాయవాదులు విధులు బహిష్కరించి బైక్ ర్యాలీ నిర్వహించారు.

స్థానిక అతిథి గృహం నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు న్యాయవాదులు బైక్‌లతో ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు మాట్లాడుతూ.. రాయలసీమ ప్రజల న్యాయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమకు తగిన న్యాయ, పరిపాలనా ప్రాధాన్యత కల్పించాల్సి ఉందని తెలిపారు. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల ప్రజలు న్యాయపరమైన వ్యవహారాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో సమయం, ఆర్థిక భారం పెరుగుతోందని పేర్కొన్నారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే రాయలసీమ జేఏసీ పిలుపు మేరకు దశలవారీగా ఆందోళనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

అదేవిధంగా పత్తికొండ డివిజన్ కేంద్రంగా ఆర్డీఓ,

డీఎస్పీ కార్యాలయాలు ఉన్నప్పటికీ సబ్‌కోర్టు లేకపోవడం వల్ల న్యాయవాదులతో పాటు ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మధుబాబు తెలిపారు. పత్తికొండలో సబ్‌కోర్టు ఏర్పాటు చేస్తే పరిసర ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మల్లికార్జున, రవిప్రకాష్, నారాయణస్వామి, సురాజ్ నబి, రంగస్వామి, రవి, జగదీష్, నెట్టేకల్లు, నరసింహులు, వాసు, సుధాకృష్ణ, భాస్కర్, రాజశేఖర్, అలీ, వీరేష్, మధు, నాగరాజు, నాగభూషణం, శ్రీను, రామంజి, బషీర్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## నేపాల్ విలయంతో భారత్‌కు హెచ్చరిక

న్యూఢిల్లీ: నేపాల్ విలయం తరవాత ఇప్పుడు భారత్‌కూ ఇలాంటి ముప్పే పొంచి ఉందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే అది చైనా వల్లనే అని తెలుస్తోంది. బ్రహ్మపుత్రపై చైనా నిర్మిస్తున్న భారీ డ్యామే. బీజింగ్‌తో మనకు నదీజల వివాద పరిష్కార ఒప్పందాలు, యంత్రాంగం లేవు. బ్రహ్మపుత్రలో ప్రవాహ హెచ్చుతగ్గులు, వర్షపాతం వంటి సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికైతే ఒక అవగాహనా ఒప్పందం ఉంది. దాన్ని అయిదేళ్లకు ఒకసారి పునరుద్ధరించవచ్చు. ఒకవేళ డ్యామ్ నిర్మాణం తర్వాత చైనా దాన్ని పునరుద్ధరించకపోతే.. భారత్‌కు పెను సమస్యగా మారుతుంది. దీనికి తోడు ఈ నిర్మాణం చేపట్టే ప్రాంతంలో ప్రకృతి విపత్తులకూ ఆస్కారం ఎక్కువే. అందువల్ల భవిష్యత్తులో ఈ నదిలో టిబెట్ వైపు ఏదైనా విపత్తు సంభవిస్తే.. చైనా దాన్ని భారత్‌కు చేరవేయకపోతే ఈశాన్య రాష్ట్రాలు వరదల్లో మునిగే ప్రమాదం ఉంది. బ్రహ్మపుత్ర నదిని టిబెట్‌లో యార్లంగ్ జాంగ్బో అంటారు. ఈ నదిపైనే చైనా ఏకంగా 167 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో భారీ జలవిద్యుత్తు ప్రాజెక్ట్ నిర్మిస్తోంది. ఇందుకోసం డ్యామ్ నిర్మాణం చేపడుతోంది. చైనా గతంలో నిర్మించిన ప్రపంచంలో అతిపెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్‌కన్నా ఇది మూడురెట్లు భారీది. బ్రహ్మపుత్ర నది 'గ్రేట్ బెండ్'గా పిలిచే భారీ వంపు ప్రాంతంలో నీరు రెండువేల మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. స్వల్పదూరంలో పైనుంచి పడటంవల్ల అక్కడ జల విద్యుత్తు ఉత్పత్తి ఎక్కువగా చేయెుచ్చు. ఏటా 60వేల మెగావాట్ల విద్యుత్‌ను ఇది ఉత్పత్తి చేయగలదని చైనా చెబుతోంది. అయితే, ఈ నిర్మాణ ప్రాంతమే ఇప్పుడు భారత్‌కు సమస్యగా మారింది. ఈ ప్రాజెక్ట్‌పై ఆ మధ్య చైనా

జియలాజికల్ సర్వే పర్యవేక్షణలో ఓ అధ్యయనం జరిగింది. ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న ప్రాంతం అడుగు భాగంలోనే 'ఫైజెన్ ఫాల్ట్' (పగులు) ఉందని, ఇది అక్కడున్న రాళ్లను చీల్చుతున్నట్లుగా అందులో గుర్తించారు. ఈ బీటలు జల విద్యుత్ ప్రాజెక్టు సమీపంలో నిర్మించే డ్యామ్‌లు, రోడ్లు, వంతెనలు, సొరంగాల వంటి మౌలిక సదుపాయాలను గణనీయంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల భూకంపాలు సంభవిస్తే ఇక్కడ పరిస్థితిని అంచనా వేయడం కూడా కష్టమేనని నిపుణులు పేర్కొంటున్నారు. బ్రహ్మపుత్ర నదిపై భారత్‌లో కోట్లాది మంది ప్రజల జీవనం ఆధారపడి ఉంది. అస్సాం, అరుణాచల్ రాష్ట్రాల ప్రజలకు ఈ నదే ప్రాణాధారం. మామూలుగానే ఏటా బ్రహ్మపుత్రలో వరదల కారణంగా ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పుడు చైనా ఈ డ్యామ్‌ను నిర్మించిన తర్వాత.. ఇరు దేశాల మధ్య ఘర్షణలు తలెత్తి మెగా డ్యామ్ నుంచి ఒక్క పెట్టున అపార జలరాశిని విడుదలచేస్తే అది మన ఈశాన్య రాష్ట్రాల్లో విలయం సృష్టించే ప్రమాదం ఉంది. మరోవైపు, డ్యామ్ నిర్మాణం వల్ల బ్రహ్మపుత్రలో ప్రవాహం తగ్గిపోయినా పర్యవసానాలు తీవ్రంగానే ఉంటాయి. చైనా దిగువకు నీటికి విడుదల చేయకపోయినా.. నదిలో నీటి లభ్యత తగ్గితే సాగునీటికీ, తాగునీటికీ ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందుకే బీజింగ్ మెగా డ్యామ్ సమస్యను ఎదుర్కొనేందుకు భారత్ కూడా 11వేల మెగావాట్ల సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సిద్ధమైంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని సియాంగ్ నదిలో నిర్మించతలపెట్టిన ఈ డ్యామ్.. ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు సాయపడుతుంది. కొందరు భూగర్భ శాస్త్రవేత్తలు దీన్ని డ్యామ్ అని కాకుండా 'వాటర్ బాంబ్' అని పిలుస్తున్నారు. చైనా ఆధీనంలోని టిబెట్ అటానమస్ రీజియన్‌లోని ఈ ఆనకట్ట నిర్మాణం జరుగుతోంది. అయితే ఈ రీజియన్ ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తాయి. ఒకవేళ డ్యామ్ నిర్మించాక భూకంపం ఏర్పడితే భారత్, బంగ్లాదేశ్‌లపై తీవ్ర ప్రభావం పడుతుంది.

## ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు

చెన్నై: ఈశా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు నేపాల్ వరదల్లో గల్లంతైన నేపథ్యంలో సంస్థలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సద్గురు అనుచరులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. సాధారణంగా నవ్వుతూ కనిపించే సద్గురు జగ్గీ వాసుదేవ్ కూడా దుఃఖాన్ని అణుచుకోలేక పోయారు. కైలాశ్ యాత్ర అనంతరం ఈశా ఫౌండేషన్ యాత్రికులు టిబెట్‌లోని గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్న సమయంలో వరద ముంచెత్తినట్టు తెలుస్తోంది. టిబెట్‌లో జరిగిందని చెబుతూ సద్గురు కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం అక్కడికి వెళదామనుకున్నా కుదరలేదని చెప్పారు. గల్లంతైన వారి గురించి ఇప్పటివరకూ తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని అన్నారు. పరిస్థితి చాలా దారుణంగా కనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్‌లో ఈశా యాత్రికుల బృందం ఉన్న సమయంలో ఆ ప్రాంతాన్ని వరద ముంచెత్తిందని చెప్పారు. తాము ఇమిగ్రేషన్ సెంటర్‌కు వచ్చినట్టు ఈశా గ్రూప్ లీడర్ ప్రవీణ్ నుంచి తనకు ఉదయం 9.05 గంటలకు మెసేజీ వచ్చిందని సద్గురు చెప్పారు. ఆ తరువాత 9.14కు ఆ భవన సముదాయాన్ని వరద ముంచెత్తిందని అన్నారు. గ్రూప్ లీడర్ ప్రవీణ్‌తో ఈశా ఫౌండేషన్ రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందని చెబుతూ కన్నీటిపర్యంత మయ్యారు. కొన్ని క్షణాలకు తేరుకున్న ఆయన మళ్లీ మాట్లాడుతూ ప్రవీణ్ వద్ద ఉన్న నేపాల్ ఫోన్ నెంబర్ ఆ రోజంతా యాక్టివ్‌గా లేదని చెప్పారు. 'ఆయన దాటి వచ్చి ఉంటే నేపాల్ ఫోన్ యాక్టివ్ అయ్యి ఉండేది. కానీ అలా జరగలేదు. అంటే, గ్రూప్ మొత్తం ఇమిగ్రేషన్ సెంటర్‌లోనే ఉండి ఉంటుంది' అని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాను మరికొంత మందితో కలిసి అక్కడికి వెళ్లేందుకు భారత్, చైనాల అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టిబెట్‌లో మంచుచరియలు విరిగిపడటంతో అక్కడి

నదిలో పోటెత్తిన వరద దిగువ ఉన్న నేపాల్‌లో జలప్రళయం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో 170 మంది మరణించగా, 1500 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనలో గల్లంతైన భారతీయుల్లో 100 మంది ఆచూకీ తెలిసినట్టు సమాచారం.

## మంచుకొండల్లో మహా విలయం

నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. భోటే కోషి, త్రిశూలి నదుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాలు వరద ప్రవాహానికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు వరద నీటిలో కొట్టుకుపోయాయి.

ప్రకృతి విలయానికి ఇది సజీవ సాక్ష్యంగా నిలిచింది. గతంలో భారత్‌లో జరిగిన హిమానీ నదాలు ఉప్పొంగి న దానికి మించి అన్నట్లుగా ఈ విలయం ఉంది. ఊళ్లకు ఊళ్లే ధ్వంసం అయ్యాయి. కొండ ప్రాంతాలను కబళించి..కట్టడాలతో ప్రకృతిని దెబ్బతీసారు. దీంతో విలయం తీవ్రంగా ఉంది. ఊళ్లకు ఊళ్లు కొట్టుకు పోవడంతో ప్రజలు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయారు. పర్యాటకులు కూడా కొట్టుకు పోయారు. ఎంతమంది ఎక్కడెక్కడ పోయారో లెక్కకట్టడం ఇప్పట్లో అయ్యే పనికాదు. ఇది మనకు హెచ్చరికలాంటిది. ప్రకృతి విలయాలకు పరిష్కారం కనుగొనడం లేదు. రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా తీసిన ఏరియల్ వీడియోల్లో వరద విధ్వంసం భయానకంగా కనిపిస్తోంది. ఇళ్లు, మార్కెట్లతో కళకళలాడిన ప్రాంతాలు వరద తర్వాత బురద, శిథిలాలతో నిండిపోయాయి. కొన్ని చోట్ల గ్రామాలు ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. వరద ఉధృతికి అనేక ప్రాంతాల్లో ఇళ్ల కింది అంతస్తులు పూర్తిగా బురదలో కూరుకు పోయాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం కూడా కష్టంగా మారింది. హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వందల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. భోటే కోషి నది ఉప్పొంగడంతో అనేక జిల్లాలను వరద, బురద కలిసి ముంచెత్తింది. ఈ జలప్రళయానికి మంచుకొండల్లో భూకంపమే కారణమని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, హిమనీ సరస్సు బద్దలవడం వల్లే ఈ విపత్తు సంభవించినట్లు తాజాగా అమెరికా జియాలాజికల్ సర్వే తాజాగా వెల్లడించింది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ప్రతినిధి డేవిడ్ ఫిషర్ మాట్లాడుతూ.. మొత్తం గ్రామాలు, మార్కెట్ ప్రాంతాలు తుడిచిపెట్టుకుపోయాయని తెలిపారు. బుధవారం ఉదయం 8.37 గంటల సమయంలో టిబెట్‌లోని గోసాయిన్‌కుండ ప్రాంతంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు తొలుత అమెరికా అధ్యయన సంస్థ అంచనా వేసింది. దాని ప్రభావంతో టిబెట్, నేపాల్ (సరిహద్దులోని పర్వత సమూహం నుంచి భారీ కొండ చరియ విరిగిపడినట్లు పేర్కొంది. అయితే, తాజాగా దీనిపై వివరణ ఇచ్చింది. కొండచరియలు విరిగిపడటం వల్లే ప్రకంపనలు సంభవించినట్లు తేలింది. హిమనీ సరస్సు బద్దలై భారీ మంచు చరియలు, రాళ్లు పడ్డాయి. దీంతో లిండే నది ఉప్పొంగి.. బోటే కోషి నదిలోకి వరద ఒక్కసారిగా దూసుకొచ్చిందని అమెరికా జియాలాజికల్ సర్వే స్పష్టం చేసింది. పర్వత ప్రాంతాల నుంచి భారీ పరిమాణంలో ఉన్న మంచు, రాళ్ల చరియలు విరిగిపడుతున్నట్లు శాటిలైట్ దృశ్యాల ద్వారా తెలిసిందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ వరదలను జర్మన్ రీసర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ విశ్లేషించింది. జల ప్రళయానికి దాదాపు 7 నిమిషాల ముందు 4.4 తీవ్రతతో ప్రకంపనలు సంభవించినట్లు తాము గుర్తించామని తెలిపింది. ఆ వెంటనే భీకర వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తినట్లు పేర్కొంది. ఈ విపత్తులో ఇప్పటివరకు 157 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గల్లంతయ్యారు. వీరిలో అత్యధికులు విదేశీయులే. భారత్ నుంచి 140 మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. అటు టిబెట్ వైపు కూడా వరద తీవ్రత ఎక్కువగానే ఉంది. ఆ దేశంలో ముగ్గురు మరణించగా.. 553 మందికి పైగా గల్లంత య్యారు. హిమాలయ దేశం నేపాల్‌లో జలప్రళయం వెనుక సమాచార లోపం కూడా ఓ బలమైన కారణంగా కన్పిస్తోంది. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు వరద సంభవించినట్లు చైనాకు ముందే తెలిసినా

తమను హెచ్చరించలేదని నేపాల్ గగ్గోలు పెడుతోంది. ఇరు దేశాల మధ్య ఈ సమాచారమార్పిడికి అధికారిక ఒప్పందం లేకపోవడంతో నేపాల్‌ను బీజింగ్ ముందస్తుగా అప్రమత్తం చేయలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, చైనా విషయంలో ఇప్పుడు భారత్‌ను కూడా ఇలాంటి సమస్యే వేధిస్తోంది. బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మిస్తోన్న భారీ డ్యామ్‌తో మన ఈశాన్య రాష్ట్రాలకు కూడా నేపాల్ లాంటి ముప్పు పొంచి ఉందని మరోసారి నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేపాల్ కాలమానం ప్రకారం ఉదయం 8.15 గంటలకు టిబెట్‌లోని కెరుంగీ కౌంటీలో మెరుపు వరదలు సంభవించాయి. ఈ ఘటన జరిగిన దాదాపు 45 నిమిషాల తర్వాత నేపాల్‌కు వరదల విషయం తెలిసిందే. అంత సమయం ఉన్నా కూడా చైనా అధికారులు నేపాల్‌ను అప్రమత్తం చేయలేదట. కెరుంగీ నుంచి భారీగా వరదల నేపాల్ దిశగా పోటెత్తినట్లు కొంతమంది స్థానికుల నుంచి చివరకు విపత్తు నిర్వహణ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో వీరు హుటాహుటిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతుండగా.. అప్పటికే వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తింది.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక
గుంటూరు
శుక్రవారం, 28 ఆగష్టు 2026
వార్తలు

# మహిళలకు ఉపాధి కల్పించే ప్రతి ప్రయత్నానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

## ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, 27 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడానికి నైపుణ్యాభివృద్ధి అత్యంత అవసరమని, అటువంటి మహిళలకు ప్రభుత్వం అండగా ఉంటుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గురువారం గుంటూరు వికాస్ నగర్‌లో మదర్ తెరీసా బహుజన సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, టైలరింగ్ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.
ఈ కార్యక్రమాన్ని జనసేన నాయకురాలు, మాజీ కార్పొరేటర్ అభ్యర్థి, మిర్చియార్డ్ డైరెక్టర్ కటకం శెట్టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో మదర్ తెరీసా బహుజన సేవా సమితి చేస్తున్న సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఈ సందర్భంగా తొలి విడతలో 50 మంది మహిళలకు కుట్టు శిక్షణ అందించడంతో పాటు వారికి రాయితీ ధరకు ఉషా కంపెనీ కుట్టు మిషన్లను అందజేశారు. సాధారణంగా రూ. 8,000 విలువ చేసే కుట్టు మిషన్‌ను కేవలం రూ.4,000కే



అందించడం ద్వారా మహిళలకు ఆర్థిక భారం తగ్గిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 50 వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మదర్ తెరీసా బహుజన సేవా సమితి పనిచేస్తోందని, ఈ లక్ష్య సాధనలో విజయలక్ష్మి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించినట్లుగా ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలన్న లక్ష్యానికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోరుకున్నట్లుగా ప్రతి మహిళ ఆత్మగౌరవంతో జీవించాలన్న ఆశయానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలు మహిళల కోసం నిలబడి సమాజంలో మార్పు తీసుకురాగలరని ఈ కార్యక్రమం నిరూపిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఇప్పటికే టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం ఒక్కో బ్యాచ్‌లో 50 మంది మహిళలకు శిక్షణ ఇస్తుండగా, రానున్న రోజుల్లో మరిన్ని బ్యాచ్‌ల ద్వారా పెద్ద సంఖ్యలో మహిళలకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. మహిళలను ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటకు తీసుకురావడానికి అనేక సంస్థలు, సేవా కార్యక్రమాలు అందుబాటు లో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

# అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**గుంటూరు, 27 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరంలో అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సి యం.సాయి కాంత్ వర్మ గురువారం పరిశీలించారు. రెండంతస్తుల భవనం మొత్తాన్ని కలియతిరిగి పరిశీలించిన కలెక్టర్, భవన నిర్మాణ ప్రస్తుత పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. భవనంలోని వివిధ విభాగాలు, నిర్మాణ పనుల పురోగతి, ఇంకా చేపట్టాల్సిన పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంబేద్కర్ భవనాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం అంబేద్కర్ భవనం పక్కనే ఉన్న బుద్ధశ్రీ ఆర్కియాలజికల్ మ్యూజియంను జిల్లా కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. మ్యూజియంలోని చారిత్రక, పురావస్తు ప్రాధాన్యత కలిగిన అంశాలను పరిశీలించి, వాటి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీనివాసరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అనిల్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి దుర్గాబాయి, తహసీల్దార్ కిరణ్, నిర్వాహకులు మేడిద బాబూరావు తదితరులు ఉన్నారు.

# శనివారం దివ్యాంగులకు ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్



## జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ

**గుంటూరు, 27 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** దివ్యాంగులకు, ఉద్యోగులకు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్‌ను శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక గ్రీవెన్స్ ఉదయం 10 గంటల నుండి జిల్లా కలెక్టర్ ప్రాంగణంలో గల ఎస్. ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో జరుగుతుందని చెప్పారు. జిల్లా అధికారులు అందరూ హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

# రూ. 8.75 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, 27 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** నియోజకవర్గంలోని ఎన్నో ఏళ్లుగా వెనకబడిన ప్రాంతమైన ప్రగతి నగర్లో అభివృద్ధికి పట్టం కడుతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక ప్రగతి నగర్, బాలాజీ నగర్ నందమూరి కాలనీ ప్రాంతాలలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పైపులైన్ల నిర్మాణానికి రూ. 8.75 కోట్లతో ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో డ్రెయిన్లు, రోడ్లు, మంచినీటి పైపు లైన్ల నిర్మాణం వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పదేళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. ప్రధాన ప్రాంతాల్లో సైతం రోడ్ల నిర్మాణం చేపట్టిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మారుమూల కాలనీలకు మంచినీళ్లు



కూడా అందించలేదని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.350 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. వంద కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటున్నామని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశామని తెలిపారు. తల్లికి వందనం అమలుతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి బాటలు వేశారన్నారు. ఇప్పటికే గూగుల్ వంటి పెద్ద సంస్థలు రాష్ట్రానికి తరలివచ్చాయని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలియజేశారు.

# రవాణాశాఖలో 83 సేవలు పూర్తిగా ఆన్లైన్లో

## పౌరులు ఆన్లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి : సీతారామిరెడ్డి

**గుంటూరు, 27 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రవాణా శాఖలో 83 సేవలను ప్రభుత్వం ఆన్లైన్ విధానంలో అందుబాటులోకి తీసుకువచ్చిందని, ప్రజలు అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగా లెర్నర్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ మరియు ఇతర ఆన్లైన్ సేవలకు సంబంధించిన ప్రభుత్వ రుసుములు సంబంధిత పోర్టల్లోనే నిర్ణయించబడి ఉంటాయని తెలియజేశారు. మెడికల్ సర్టిఫికేట్: మోటారు వాహన చట్టం ప్రకారం రవాణా డ్రైవింగ్ లైసెన్స్ పొందుటకు మరియు లైసెన్స్ రెన్యూవల్ సమయంలో ఫారం 1ఏ లో వైద్య ధృవీకరణ పత్రం తప్పనిసరి. ఈ ఫారం 1ఏ ను దరఖాస్తుదారుడు సారథి పోర్టల్ ద్వారా ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకునే సమయంలోనే డౌన్లోడ్ చేసుకోవచ్చు. డౌన్లోడ్ చేసుకున్న ఫారంను ఎంబీబీఎస్ డిగ్రీ కలిగిన ఏదైనా అధీకృత వైద్యుని వద్దకు వెళ్లి అటెస్టేషన్ చేయించుకుని, తిరిగి సారథి పోర్టల్ లో అప్లోడ్ చేసే సౌకర్యం కలదు. ఈ ప్రక్రియ పూర్తిగా ఆన్లైన్ లో దరఖాస్తుదారుడే చేసుకోవాలి. దీనికి ఈ కార్యాలయం ఎటువంటి ఫీజు వసూలు చేయదు.

**గ్రీన్ ట్యాక్స్ :** ఫిట్నెస్ ఫీజులు తదితర అన్ని రవాణాశాఖ సేవలకు సంబంధించి వాహన్ పోర్టల్ ద్వారా ఆన్లైన్లో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఎవరైనా సి ఎస్ సి / ఆన్లైన్ సెంటర్ నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుకు మించి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసినా లేదా, గ్రీన్ ట్యాక్స్, ఫిట్నెస్ ఫీజులు తదితర అన్ని రవాణాశాఖ సేవలకు సంబంధించి వాహన్ పోర్టల్ ద్వారా ఆన్లైన్లో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఎవరైనా సి ఎస్ సి / ఆన్లైన్ సెంటర్ నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుకు




మించి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసినా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, సంబంధిత రసీదు మరియు వివరాలతో రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

**ఫ్యాన్సీ నంబర్ల కేటాయింపు మరియు వాహనాల రిజిస్ట్రేషన్లు :** ఫ్యాన్సీ నంబర్ల కేటాయింపు మరియు వాహనాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి వాహన డీలర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ప్రతి షోరూముల్లో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల వివరాలతో కూడిన ఫీజు చార్టును స్పష్టంగా ప్రదర్శించాలని, ఎటువంటి అదనపు ఛార్జీలు వసూలు చేయరాదని సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. వాహన డీలర్లు వాహన కొనుగోలుదారుల నుంచి వసూలు చేసే సర్వీస్ ఛార్జీలు లేదా ఇతర రుసుములకు రవాణాశాఖకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

**ప్రజాసేవలను మెరుగు పరుచుటకు తీసుకుంటున్న చర్యలు :** 1. ఎల్ ఎల్ ఆర్ మరియు డ్రైవింగ్ లైసెన్స్ సారథి . పరివాన్ . జి ఓ వి .ఇన్ వెబ్సైట్ ద్వారా ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఎలా పొందాలి అనే దానిపై వీడియో తయారు చేసి సోషల్ మీడియాలో ప్రజలకు చేరేలా ఉంచడమైనది. 2. డ్రైవింగ్ టెస్టుకు వచ్చే దరఖాస్తుదారులకు ఎం.వి.ఐ.లచే ట్రాక్ గురించి వివరించడం, ఎక్కడ తప్పులు జరుగుతాయో చెప్పి, భయం లేకుండా టెస్టుకు హాజరయ్యేలా అవగాహన కల్పించడమైనది.

**వాహన (వాహన రిజిస్ట్రేషన్లు):** 1. వాహన డీలర్లకు కస్టమర్లతో మర్యాదగా ప్రవర్తించాలని సున్నితంగా తెలియజేయడమైనది. 2. ఆర్టిఏ చార్జీలు, హ్యాండ్లింగ్ చార్జీలు, యాక్సరీస్ పేరుతో నిర్ణయించిన ఫీజుకు మించి అదనంగా వసూలు చేయవద్దని ఆదేశించడమైనది. 3. డిమాండ్ ఉన్న వాహనాలకు ప్రీమియం వసూలు చేయవద్దని ఆదేశించడమైనది. 4. వాహన కొనుగోలుదారుని తమ షోరూమ్ లోనే ఇన్సూరెన్స్ తీసుకోవాలని ఒత్తిడి చేయవద్దని, అది కొనుగోలుదారుని ఇష్టానికే వదిలేయాలని తెలియజేయడమైనది. 5. టిఆర్ / పిఆర్ లేకుండా వాహనాలు డెలివరీ చేయవద్దని ఆదేశించడమైనది. లైఫ్ టాక్స్ స్లాబులు, ఫీజులు, సర్వీస్ చార్జీలు, కార్డు ఫీజు, రోడ్ సేఫ్టీ సెస్ మొదలైన వివరాలతో కూడిన బోర్డులను ప్రముఖ ప్రదేశాల్లో ప్రదర్శించాలని ఆదేశించడమైనది.

**టాక్స్ , పెర్మిట్ , ఎఫ్ సి :** 1.టాక్స్ & పర్మిట్ సేవలు ఆటో అప్రూవల్ లో ఉన్నాయి. దీనికి సంబంధించిన ఫ్లో చార్టులను వీడియో ద్వారా వివరించి మీడియాలో ఉంచుతున్నాము. 2. గుంటూరు జిల్లాలోని ఆటోమేటెడ్ ఫిట్నెస్ టెస్టింగ్ స్టేషన్ (ఏ టి ఎస్) అయిన ది రాయల్ ఏజెన్సీస్ వారికి ఎఫ్ సి సేవలను ఎటువంటి అవినీతి, వేధింపులు లేకుండా పారదర్శకంగా అందించాలని ఆదేశించడమైనది. ప్రజలకు రవాణాశాఖ అందిస్తున్న సేవలు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం, ఆన్లైన్ విధానంలో అందించేందుకు శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. ఎవరైనా సిఎస్‌సి / ఆన్లైన్ సెంటర్ నిర్వాహకులు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసినా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, సంబంధిత రసీదు/వివరాలతో రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని ఉప రవాణా కమిషనర్ తెలియజేశారు.



# అనుమానాస్పద హత్య కేసును ఛేదించిన నల్లపాడు పోలీసులు

## యువకుడి హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

**గుంటూరు, 27 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న అనుమానాస్పద హత్య కేసును పోలీసులు ఛేదించారు. కేసుకు సంబంధించిన వివరాలను సౌత్ డీఎస్పీ జీ. పూర్ణచంద్రరావు వెల్లడించారు. ఆగస్టు 17న తురకపాలెం జనచైతన్య ప్లాట్స్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే నల్లపాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో మృతుడు పెద్దపలకలూరు గ్రామానికి చెందిన దావులూరి ప్రసన్న (28)గా గుర్తించారు. ఆగస్టు 14 నుంచి తన కుమారుడు కనిపించడం లేదంటూ ప్రసన్న తల్లి శాంతమ్మ నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలి పారు. కేసు దర్యాప్తులో భాగంగా కూకట్పల్లి నాగేశ్వరరావు, అతని అన్న కూకట్పల్లి వెంకటయ్య కలిసి ప్రసన్నను హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రసన్నకు పెద్దపలకూరు గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉండగా, అదే మహిళతో నాగే శ్వరరావుకు కూడా వివాహేతర సంబంధం ఉన్నట్లు వెల్లడైంది. ఈ విషయంపై ప్రసన్నపై కక్ష పెంచుకున్న నాగేశ్వరరావు తన సోదరుడు వెంకటయ్యతో కలిసి ప్రసన్నను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సౌత్ డీఎస్పీ జీ. పూర్ణచంద్రరావు తెలిపారు.

# 'మహిళా గ్రీవెన్స్ డే' లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, 27 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం ప్రత్యేకంగా నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో, వివిధ సమస్యలతో వచ్చిన మహిళల నుండి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజల నుండి ప్రత్యక్షంగా అర్జీలు స్వీకరించారు. మహిళలు స్వేచ్ఛగా సమస్యలు చెప్పుకునే వాతావరణం ఇవ్వడం మా ధ్యేయమన్నారు. వచ్చిన సమస్యలను ఒక నిర్ణీత సమయంలోపు పరిష్కరించి, మహిళలకు అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

# నేడు మంగళగిరి లో జనసేన ఆత్మీయ సమావేశం

## ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నాదెండ్ల మనోహర్



**మంగళగిరి, 27 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** మంగళగిరిలోని సికె కన్వెన్షన్ లో శుక్రవారం సాయంత్రం జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం రాత్రి ఏర్పాట్లను ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తో కలసి పరిశీలించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం అయ్యేందుకు జనసేన పార్టీ ఆత్మీయ సమావేశానికి శ్రీకారం చుట్టింది. ఈ ఆత్మీయ సమావేశానికి రాష్ట్ర మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు పార్టీకి సంబంధించి వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు హాజరుకానున్నారు. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ సమావేశంలో చర్చించనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

# పల్లె నుంచి పీహెచ్.డి వరకు.. పట్టుదలతో డాక్టర్‌గా రవీంద్ర బాబు



**గుంటూరు, 27 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** సాధారణ గ్రామీణ కుటుంబం నుంచి వచ్చిన నలుకుర్తి రవీంద్ర బాబు తన కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ఉన్నత విద్యలో అరుదైన ఘనత సాధించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి రసాయన శాస్త్రంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్డీ) పట్టాను పొందారు. ప్రొఫెసర్ ఎం. సుబ్బారావు పర్యవేక్షణలో "ఇన్నోవాటివ్ మెథడాలజీస్ ఫర్ ది ఎస్టిమేషన్ అఫ్ ఆక్టివ్ ఇంగ్రెడింట్ ఇన్ బల్క డ్రగ్ దోసెజ్ ఫారం యూసింగ్ లిక్విడ్ కాలమ్ క్రోమటోగ్రఫీ " అనే అంశంపై పరిశోధన నిర్వహించి విజయవంతంగా పూర్తి చేశారు. విశ్వవిద్యాలయం నియమించిన పరీక్షకుల సిఫార్సుల మేరకు పీహెచ్.డి. పట్టా ప్రదానం చేయబడింది. బల్క్ డ్రగ్స్ మరియు ఔషధ మోతాదు రూపాల్లోని క్రియాశీల పదార్థాల ఖచ్చితమైన అంచనా కోసం లిక్విడ్ కాలమ్ క్రోమాటోగ్రఫీ ఆధారిత విశ్లేషణాత్మక పద్ధతుల అభివృద్ధి ఆయన పరిశోధనలో ప్రధాన అంశం. ఔషధ నాణ్యత, విశ్లేషణాత్మక పద్ధతుల అభివృద్ధి దిశగా ఈ పరిశోధనకు ప్రాధాన్యత ఉంది.

# కాలనీ లో కనీసమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలి

పి.యం.ఎ.వై, యన్.టి.ఆర్ కాలనీ, జగనన్న కాలనీలు అయిన బొంతపాడు, అనంతవరప్పాడులలో ప్రక్కకు ఒరిగిన కరెంట్ స్తంభాలను సరిచేయాలి






**గుంటూరు, 27 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు మున్సిపాలిటీ పరిధిలోని బొంతపాడు, అనంతవరప్పాడు ఎన్టీఆర్ కాలనీలు (జగనన్న కాలనీ) లలో వీధి దీపాలు, మంచినీరు వంటి మౌళిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.ముత్యాలరావు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం అనంతవరప్పాడు ఎన్టీఆర్ కాలనీ (జగనన్న కాలనీ)ని సిపిఎం నాయకత్వం సందర్శించారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిధులు వేల కోట్ల రూపాయల ఖర్చు పెట్టి ఇల్లు లేని పేదలకు ఇల్లు ఇచ్చారని, అయితే అక్కడ ప్రజలు నివాసానికి అవసరమైన రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని అన్నారు. కనీసమైన మౌలిక సౌకర్యాలు లేకపోతే ప్రజలు ఏ విధంగా అక్కడ జీవనం కొనసాగిస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇల్లు కాబట్టి ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటి అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సోచనీయమన్నారు. అక్కడ వేసిన విద్యుత్ స్తంభాలు ఒరిగి ఇళ్ళ మీద ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయని, అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. విద్యుత్ శాఖ వారు వెంటనే ప్రక్కకు ఒరిగిన కరెంట్ స్తంభాలు సరిచేసి ప్రమాదాలు నివారించాలని కోరారు. రాత్రులు మందుబాబులు, దొంగల బెడద నుండి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యలు పరిష్కరించి, ఎన్.టి.ఆర్ కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీని సందర్శించిన వారిలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కట్లగుంట శ్రీనివాసరావు, నగర కమిటీ సభ్యులు షేక్ ఖాసిం షహీద్, టి. శ్రీనివాసరావు, ఎ. కళ్యాణి, షేక్ ఖాశీంవలి, నాయకులు షేక్ సైదా, ఎస్. కార్తీక్ తదితరులు ఉన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట సంజీవని

పేదవాడి వైద్యానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న కూటమి ప్రభుత్వం

**కాకినాడ బ్యూరో, 27 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** 35 మంది లబ్ధిదారులకు 26 లక్షల రూపాయలు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కొండబాబు ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట సంజీవని అని, పేద వాడి వైద్యానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. కాకినాడ సిటీ నియోజకవర్గానికి చెందిన 35 మంది లబ్ధిదారులకు 26 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం శాసనసభ్యులు వారి క్యాంపు కార్యాలయం నందు నిర్వహించిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద కుటుంబాల పాలిట సంజీవనిగా నిలుస్తుందని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ



ఇవ్వని విధంగా మన ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని, ఇప్పటి వరకు కాకినాడ సిటీ నియోజకవర్గంలో సుమారు 6 కోట్ల రూపాయలు సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందచేయడం జరిగిందని, ముఖ్యమంత్రి సహాయం నిది సీఎం ఆర్ఎఫ్ సహాయం ద్వారా ఆయా కుటుంబాలకు కొంత మేరకు ఆర్థిక భరోసా లభిస్తుందని, అర్హులైన ప్రతీ పేద కుటుంబాలకు అందించడం జరుగుతుందిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, బచ్చు శేఖర్, గదుల సాయిబాబా, పలివెల రవి అనంత కుమార్, బోనేపల్లి శ్రీనివాస్, పంతాడి రాజు, అంబటి చిన్న, అల్లం రాజు, నల్లూరి శ్రీనివాస్, నూరుకుర్తి మోహన్, గాది శివరామకృష్ణ, ఎరిపిల్లి సత్తిబాబు, అంగాడి దుర్గారావు, చోడపిల్లి ప్రేమానందం, వాసంశెట్టి చిట్టప్ప, చొక్కా గిరి, బొడ్డు శివాజీ, చింతపల్లి తాతారావు, చింతా సతీష్, తెప్పల రామలింగేశ్వరరావు, బూడి ప్రకాష్, రాళ్లపూడి ప్రకాష్, పాలిక నాని, కోడూరు కుమార స్వామి, రెడ్డనం సత్తిబాబు, సయ్యద్ అలీ, పొంగా బుజ్జి, అన్వర్, కోలా ఎల్లారావ్, అందనాపల్లి శ్రీనివాస్, కోడూరు నీలిమ, పట్నాల రాఘవమ్మ, సత్య, బుంగా నూకాలమ్మ, కుసుమ కుమారి, జి సి పాణి, తదితరులు పాల్గొన్నారు.

# హై-రిస్క్ ప్రెగ్నెన్సీ – ప్రీమేచ్యూర్ బేబీకి విజయవంతమైన చికిత్స

**కాకినాడ బ్యూరో, 27 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడలో తల్లి శిశువు విభాగం విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ విభాగం ద్వారా అందిస్తున్న గైనకాలజీ, ప్రసూతి మరియు శిశు వైద్య సేవలు, హై-రిస్క్ ప్రెగ్నెన్సీలకు అందిస్తున్న ప్రత్యేక వైద్య పర్యవేక్షణ, ప్రీమేచ్యూర్ బేబీలకు అందిస్తున్న ఎన్ ఐ సి యు సేవల గురించి వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా ఇటీవల 7.5 నెలల గర్భధారణలో ఉన్న ఒక గర్భిణి హై-రిస్క్ పరిస్థితుల్లో మెడికవర్ హాస్పిటల్స్‌కు రావడం జరిగింది. గర్భిణి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రముఖ గైనకాలజిస్ట్ డా.లక్ష్మీ ప్రవీణ ఆధ్వర్యంలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి గర్భిణిని నిరంతరం పర్యవేక్షించారు. తల్లి, శిశువు ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ సరైన సమయంలో ప్రసవానికి సంబంధించిన నిర్ణయం తీసుకున్నారు. వైద్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విజయవంతంగా డెలివరీ నిర్వహించగా, ప్రీమేచ్యూర్ బేబీ జన్మించింది. పుట్టిన అనంతరం శిశువు పరిస్థితి క్రిటికల్‌గా ఉండటంతో వెంటనే ఎన్‌ఐసియులో చేర్చి ప్రత్యేక చికిత్స అందించారు. ప్రముఖ పీడియాట్రిషియన్ డా.వి.సుబ్బారావు ఆధ్వర్యంలో శిశువుకు ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ అందించారు. శిశువు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన వెంటిలేటర్ సపోర్ట్, ఐసిడి ట్యూబ్ ఇతర అత్యవసర వైద్య విధానాల సహాయంతో చికిత్స అందించారు. ప్రీమేచ్యూర్ బేబీ కావడంతో శిశువు శ్వాస, ఆక్సిజన్ స్థాయిలు, హృదయ స్పందన ఇతర ముఖ్యమైన ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ దశలవారీగా చికిత్స అందించారు. వైద్య బృందం సమన్వయంతో అందించిన నిరంతర చికిత్స ప్రత్యేక సంరక్షణకు శిశువు క్రమంగా స్పందించింది. చికిత్స అనంతరం తల్లి శిశువు ఆరోగ్యంలో గణనీయమైన మెరుగుదల కనిపించడంతో 15 రోజుల తర్వాత ఇద్దరినీ ఆరోగ్యకరమైన స్థితిలో డిశ్చార్జ్ చేయడం జరిగింది.

**డా. లక్ష్మీ ప్రవీణ బి, ప్రముఖ గైనకాలజిస్ట్ మాట్లాడుతూ** హై-రిస్క్ ప్రెగ్నెన్సీలో ప్రతి గర్భిణి పరిస్థితి ఒకే విధంగా ఉండదు. ముఖ్యంగా ప్రీటర్మ్ డెలివరీకి అవకాశం ఉన్న సందర్భాల్లో తల్లి, శిశువు ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించడం చాలా ముఖ్యం ఈ కేసులో గర్భిణి పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తూ సరైన సమయంలో డెలివరీ చేయాలని నిర్ణయించాం. ప్రీటర్మ్ బేబీ జన్మించిన తర్వాత వెంటనే ఎన్ ఐ సి యు సపోర్ట్ అవసరమైంది. గైనకాలజీ, పీడియాట్రిక్ ఎన్ ఐ సి యు బృందాల సమన్వయంతో తల్లికి, శిశువుకు అవసరమైన చికిత్స అందించగలిగాం ప్రస్తుతం తల్లి మరియు బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉండటం సంతోషంగా ఉంది.




**డా. వి. సుబ్బారావు, ప్రముఖ పీడియాట్రిషియన్ మాట్లాడుతూ,** "ప్రీమేచ్యూర్ బేబీలలో పుట్టిన వెంటనే శ్వాస సంబంధిత సమస్యలు, ఆక్సిజన్ స్థాయిలలో మార్పులు మరియు ఇతర సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ బిడ్డ పుట్టిన వెంటనే పరిస్థితి క్రిటికల్‌గా ఉండటంతో ఎన్‌ఐసియు లో ప్రత్యేక పర్యవేక్షణ ప్రారంభించాం. అవసరాన్ని బట్టి వెంటిలేటర్ సపోర్ట్, ఐ సి డి ట్యూబ్ వంటి వైద్య విధానాలతో పాటు నిరంతర మానిటరింగ్ అందించాం. ప్రీమేచ్యూర్ బేబీకి చికిత్స అనేది ఒకరోజులో పూర్తయ్యేది కాదు బిడ్డ పరిస్థితిని బట్టి దశలవారీగా చికిత్స అందిస్తూ ప్రతి దశలో స్పందనను అంచనా వేయాల్సి ఉంటుంది. ఈ బిడ్డ కూడా చికిత్సకు క్రమంగా స్పందించి 15 రోజుల తర్వాత ఆరోగ్యకరమైన స్థితిలో డిశ్చార్జ్ కావడం ఆనందంగా ఉంది. డా. కస్తూరి బాయి వెలగ, ప్రముఖ గైనకాలజిస్ట్ మాట్లాడుతూ తల్లి శిశువు విభాగం ప్రారంభించి ఒక సంవత్సరం పూర్తి చేసుకోవడం మా ఆసుపత్రికి ఎంతో ప్రత్యేకమైన సందర్భం మహిళలకు గర్భధారణకు ముందు నుంచి ప్రసవం వరకు అలాగే ప్రసవం అనంతరం కూడా అవసరమైన వైద్య సేవలు ఒకే చోట అందించడం మా ప్రధాన లక్ష్యం అని తెలిపారు. డా. సుజన నిమ్మకాయల, ప్రముఖ గైనకాలజిస్ట్ మాట్లాడుతూ గర్భధారణ సమయంలో తల్లి ఆరోగ్యంతో పాటు గర్భంలోని శిశువు ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితిని కూడా నిరంతరం పర్యవేక్షించడం చాలా ముఖ్యం. హై-రిస్క్ ప్రెగ్నెన్సీల్లో ప్రత్యేక శ్రద్ధ, రెగ్యులర్ చెకప్స్, అవసరమైన సమయంలో సరైన వైద్య నిర్ణయం తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ఎంతో కీలకం. ఈ విభాగం ఒక సంవత్సరం పూర్తి చేసుకోవడం మా మొత్తం వైద్య బృందానికి ఎంతో గర్వకారణం అని అన్నారు.

**డా. శ్రావణి సాక్షి, ప్రముఖ గైనకాలజిస్టు మాట్లాడుతూ** గర్భధారణ సమయంలో ప్రతి మహిళకు ప్రత్యేకమైన వైద్య పర్యవేక్షణ అవసరం ముఖ్యంగా హై-రిస్క్ ప్రెగ్నెన్సీల్లో తల్లి ఆరోగ్యంతో పాటు గర్భంలోని శిశువు ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయడం చాలా ముఖ్యం రెగ్యులర్ చెకప్స్, అవసరమైన




వైద్య పరీక్షలు సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా అనేక సమస్యలను ముందుగానే గుర్తించి తల్లి, బిడ్డకు మెరుగైన వైద్య సంరక్షణ అందించవచ్చు.

**డా. రవి అంగర, ప్రముఖ పీడియాట్రిషియన్ మాట్లాడుతూ,** శిశువుల ఆరోగ్యంలో ముఖ్యంగా పుట్టిన వెంటనే అందించే వైద్య సంరక్షణ చాలా కీలకం. ప్రీమేచ్యూర్ మరియు హై-రిస్క్ బేబీలకు ఎన్ ఐ సి యు లో నిరంతర పర్యవేక్షణ అవసరమైన సమయంలో వెంటనే వైద్య సహాయం శిశువు ఎదుగుదల ఆరోగ్య పరిస్థితిని దశలవారీగా అంచనా వేయడం ఎంతో ముఖ్యం. తల్లి శిశువు విభాగంలో గైనకాలజీ, పీడియాట్రిక్స్ ఎన్ ఐ సి యు బృందాల సమన్వయంతో చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. ఈ విభాగం ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా మరింత మంది తల్లులు, చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు మా బృందం మరింత బాధ్యతతో పనిచేస్తుంది" అని తెలిపారు.

మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడ సెంటర్ హెడ్ నందికోళ్ల ఆంజనేయస్వామి (అంజిబాబు) మాట్లాడుతూ "మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడలో తల్లి శిశువు,విభాగం విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషకరమైన విషయం ఈ ఒక సంవత్సర కాలంలో మహిళలు, చిన్నారులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా మా వైద్య బృందం నిరంతరం పనిచేస్తుంది అని ముఖ్యంగా హై-రిస్క్ ప్రెగ్నెన్సీలు, ప్రీటర్మ్ డెలివరీలు, నవజాత శిశువులకు అవసరమైన ప్రత్యేక వైద్య సంరక్షణను ఒకే చోట అందించే విధంగా మా సేవలను అభివృద్ధి చేసుకున్నాం. గైనకాలజీ, పీడియాట్రిక్స్ ఎన్ ఐ సి యు విభాగాల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఇతర సహాయక బృందాల సమన్వయంతో ప్రతి తల్లి, ప్రతి శిశువుకు అవసరమైన సమయంలో సరైన వైద్య సేవలు అందించడమే మా ప్రధాన ఉద్దేశ్యం కాకినాడ పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన మహిళా, శిశు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి మెడికవర్ హాస్పిటల్స్ నిరంతరం కృషి చేస్తుంది అని తెలిపారు.

# ఏపీఐడీసీ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ

పారిశ్రామిక ప్రగతిపై పాలకవర్గ సమావేశంలో సుదీర్ఘ చర్చ
ఛైర్మన్ దేగల ప్రభాకర్ అధ్యక్షతన కీలక అంశాలపై సమీక్ష

**గుంటూరు, 27 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐడీసీ) కార్యకలాపాలను మరింత వేగవంతం చేయడం, కార్పొరేషన్ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం, పారిశ్రామిక రంగానికి మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపట్టడంపై నేడు తాడేపల్లిలోని ఏపీఐడీసీ కార్యాలయంలో జరిగిన పాలకవర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఏపీఐడీసీ ఛైర్మన్ దేగల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు, కార్పొరేషన్ ఉన్నతాధికారులు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. కార్పొరేషన్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులు సమగ్ర వివరాలను పాలకవర్గానికి అందించారు.

**అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష**

సమావేశంలో ఏపీఐడీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ కార్యక్రమాలు, కార్పొరేషన్ అభివృద్ధి పురోగతి, భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాల ఫలితాలను సమీక్షించడంతో పాటు, మరింత సమర్థవంతంగా ముందుకు వెళ్లేందుకు అవసరమైన చర్యలపై పాలకవర్గ సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పారిశ్రామిక రంగానికి అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడం, పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించడం, పారిశ్రామిక వేత్తలకు అవసరమైన సహకారం అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో చర్చించారు.

**పాలకవర్గ సభ్యుల సూచనలు**

కార్పొరేషన్ అభివృద్ధి, పనితీరు, భవిష్యత్ కార్యాచరణపై పాలకవర్గ సభ్యుల నుంచి ఛైర్మన్ దేగల ప్రభాకర్ సూచనలు, సలహాలు స్వీకరించారు. సభ్యులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడిస్తూ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అధికారులు అందించిన



నివేదికలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని పరిశీలించిన పాలకవర్గం, పెండింగ్‌లో ఉన్న అంశాలను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని గుర్తించింది.

**పారిశ్రామిక ప్రగతికి ప్రాధాన్యత**

రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించడంతో పాటు కొత్త పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడంలో ఏపీఐడీసీ మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరంపై సమావేశంలో చర్చ జరిగింది. పారిశ్రామికవేత్తలకు ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచనలు చేసినట్లు సమావేశంలో వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం, పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యత ఇవ్వాలని చర్చించారు.

**భవిష్యత్ కార్యాచరణపై దృష్టి**

ఏపీఐడీసీ భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి కూడా సమావేశంలో కీలకంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగ అభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా కార్పొరేషన్ తన కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని పాలకవర్గం అభిప్రాయపడింది. కార్పొరేషన్‌కు అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో వేగం పెంచాలని నిర్ణయించారు. పారిశ్రామిక రంగానికి అవసరమైన మద్దతు, మౌలిక వసతులు, సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఏపీఐడీసీ తన వంతు సహకారం అందించాలనే అంశంపై



సమావేశంలో చర్చ జరిగింది.

**ఏపీఐడీసీ ఛైర్మన్ దేగల ప్రభాకర్ మాట్లాడుతూ,** రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో ఏపీఐడీసీకి ఉన్న బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేషన్ అభివృద్ధి విషయంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశ్రామిక రంగానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా ఏపీఐడీసీ తన కార్యకలాపాలను మరింత వేగవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్పొరేషన్ అభివృద్ధికి సంబంధించి పాలకవర్గ సభ్యులు అందించిన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగుతామని ఛైర్మన్ తెలిపారు.

**అధికారులకు దిశానిర్దేశం**

కార్పొరేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న ఛైర్మన్, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాలకవర్గ నిర్ణయాలు, సూచనలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధికి అనుకూలమైన వాతావరణం మరింత బలోపేతం అయ్యేలా ఏపీఐడీసీ తరఫున అవసరమైన చర్యలను సమన్వయంతో చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ఏపీ ఐడీసీ యండి రఘునాథ,పాలకవర్గ సభ్యులు,జలగం రాజారావు, సందీప్, మల్హోత్రా, బాలబరతి, రమణయ్య మరియు కార్పొరేషన్ ఉన్న తాధికారులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఎఐసిసి పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

**అధిష్టానం తీసుకునే నిర్ణయం అందరికీ శిరోధార్యం**

**కాంగ్రెస్‌లో వ్యక్తిగత కోపాలకు తావు లేదన్న మహేశ్ గౌడ్**

**నిజామాబాద్,ఆగస్ట్27 :** మంత్రి కొండా సురేఖ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా.. కుమార్తె కామెంట్స్‌కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందన్నారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉందని, అయితే అది క్రమశిక్షణకు లోబడి ఉండాలన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లోనే స్వేచ్ఛ ఎక్కువన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. ఇకపోతే తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు సర్ నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# మేమంతా క్షేమంగా ఉన్నాం: సతీష్ రెడ్డి

**హైదరాబాద్,ఆగస్ట్27 :** భారీ వరదలతో నేపాల్ పరిసర ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. ఈ వరదల వల్ల వంద మందికిపైగా మరణించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక వందలాది మంది గల్లంతయ్యారు. వారిలో విదేశీయులు కూడా ఉన్నారు. ఆ జాబితాలో భారతీయులు కూడా ఉన్నట్లు వార్తా కథనాలు వెలువడుతున్నాయి. దీంతో భారత్‌లోని వారి కుటుంబ సభ్యులు తీవ్ర కలత చెందుతున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటికే రంగంలోకి దిగి వారి ఆచూకీ కోసం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో టిబెట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి స్పందించారు. ఆయన తాము క్షేమంగా ఉన్నామని, తాము వరదల్లో చిక్కుకోలేదన్నారు. తాము ఉన్న ప్రాంతంలో వరదల ప్రభావం లేదని తెలిపారు. తామంతా క్షేమంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఆగస్టు 30వ తేదీన హైదరాబాద్ చేరుకుంటామని సతీష్ రెడ్డి చెప్పారు.

# వనపర్తిలో రైస్‌మిల్లర్లపై బుల్‌డోజర్లు

**ప్రభుత్వానికి భారీగా ఎగవేసిన మిల్లులు కూల్చివేత**

**వనపర్తి,ఆగస్ట్27 :** వనపర్తి జిల్లాలో సివిల్ సప్లై రంగానికి సంబంధించి నిబంధనలు ఉల్లంఘిస్తూ, ప్రభుత్వానికి కోట్లాది రూపాయల బకాయిలు పడిన రైస్ మిల్లులపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలకు దిగింది. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించి నిర్వహిస్తున్న చాముండి రైస్ మిల్ , సాంబశివ రైస్ మిల్లులను అధికారులు శనివారం కూల్చివేశారు. సివిల్ సప్లైస్ శాఖ, రెవెన్యూ విభాగం, ఇతర అధికారుల ఉమ్మడి ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించి బుల్డోజర్లతో మిల్లు నిర్మాణాలను నేలమట్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న మిల్లర్లకు ఈ చర్య ద్వారా అధికారులు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సివిల్ సప్లై బకాయిలను వసూలు చేసేందుకు అధికారులు ఎంత ప్రయత్నించినప్పటికీ రైస్ మిల్లుల యజమానులు ఏమాత్రం స్పందించలేదు. విచారణలో భాగంగా సాంబశివ రైస్ మిల్ ప్రభుత్వానికి రూ. 13 కోట్ల పైచిలుకు బకాయి పడగా, చాముండి రైస్ మిల్ ఏకంగా రూ. 39 కోట్ల మేర బకాయి పడినట్లు నిర్ధారణ అయ్యింది. మొత్తం రూ.52 కోట్లకు పైగా మొండిబకాయిలను చెల్లించకుండా తీవ్ర నిర్లక్ష్యం వహించడమే కాకుండా, కనీస అనుమతులు లేకుండా మిల్లులను నిర్వహించడంతో జిల్లా యంత్రాంగం చట్టపరమైన చర్యలను వేగవంతం చేసింది. రెవెన్యూ శాఖ సహకారంతో ఈ రెండు మిల్లులను పూర్తిగా కూల్చివేసి, బకాయిల రికవరీ దిశగా తదుపరి చర్యలు చేపట్టారు.

# తెలంగాణలో నడుస్తున్నది పోలీస్ పాలన

**పాలిటెక్నిక్ సమస్యలపై పోరాటం కొనసగుతుంది: బిజెపి**

**హైదరాబాద్,ఆగస్ట్27 :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నడుపుతున్నది ప్రజా పాలన కాదు, పోలీసుల నిర్బంధ పాలన అని స్పష్టమవుతోందని బిజెపి విమర్శించింది. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే వివాదాస్పద జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్, మాసాబ్‌ట్యాంక్, రామంతపూర్ నుంచి మొదలుకొని వనపర్తి, పరకాల దాకా విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా రోడ్డెక్కితే.. వారిపై లాఠీఛార్జీలు చేయించడం, అరెస్టులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల న్యాయమైన ఆందోళనకు మద్దతు తెలపడానికి వెళ్తున్న మా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తో పాటు పార్టీ ముఖ్య నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయించడం కాంగ్రెస్ పిరికితనానికి నిదర్శనం. చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పాలిత తెలంగాణలో విద్యార్థుల హక్కులను కాలరాస్తుంటే ఎందుకు కనిపించడం లేదన్నారు. పాలిటెక్నిక్ సాంకేతిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, విద్యార్థులకు ఉన్నత విద్య (ఈసెట్) అవకాశాలను దూరం చేసే కుట్రలను రేవంత్ రెడ్డి సర్కార్ తక్షణమే విరమించుకోవాలి. కంటితుడుపు కమిటీలతో కాలయాపన చేయకుండా వివాదాస్పద జీవో 97ను వెంటనే బేషరతుగా రద్దు చేయాలి. తెలంగాణ విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం భారతీయ జనతా పార్టీ అండగా నిలబడి చివరిదాకా రాజీలేని పోరాటం చేస్తుంది.

# 'ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**అర్హులైన ప్రతి ఓటరు తమ పేరు పరిశీలించుకోవాలి**

**నిజాంసాగర్, ఆగస్టు 27 :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం నిజాంసాగర్ మండల కేంద్రంలోని బంజేపల్లి గ్రామపంచాయతీలో గురువారం నిర్వహించిన గ్రామసభలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ తదుపరి ప్రక్రియపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో ప్రతి అర్హుడి పేరు ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా చేపడుతున్న ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఏలే మల్లికార్జున్ పిలుపునిచ్చారు. మ-ంసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, పేరు లేకపోయినా లేదా ఓటరు జాబితాలో ఏవైనా తప్పులు ఉన్నా సంబంధిత బీఎల్‌ఓ, ఎఈఆర్‌ఓ, ఈఆర్‌ఓ అధికారులను సంప్రదించి అవసరమైన దరఖాస్తులు, క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించుకోవాలని సూచించారు. ఫారం 6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు, ఫారం 7 ద్వారా మరణించిన లేదా డూప్లికేట్ ఓటర్లపై అభ్యంతరాలు, ఫారం 8 ద్వారా మొబైల్ నంబర్, చిరునామా తదితర వివరాల సవరణలు చేసుకునే అవకాశం ఉందని ప్రజలకు వివరించారు. సర్ ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 16వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించే ప్రక్రియ కొనసాగుతుందని, అనంతరం అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరు

**అరెస్టులు, జైళ్లు నాకు కొత్త కాదు**
**పాలిటెక్నిక్ ప్రైవేటీకరణ జీవో 97ని రద్దు చేయాలి**
**రాహుల్ జీ.. మీరొచ్చి అయినా ఆ పని చేయించండి**
**లేదంటే ఏఐసీసీ ఆఫీసుని ముట్టడిస్తాం**
**22ఏ నిషేధిత భూముల జాబితాను ఉపసంహరించాలి**
**హరీష్ రావు డిమాండ్**
**హన్మకొండలో అరెస్ట్.. కోకాపేటలో గృహ నిర్బంధం**



**హైదరాబాద్ :** రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోంది.. ప్రతిపక్ష పార్టీల నేతల గొంతు నొక్కాలని చూస్తున్నారు.. సమస్యలపైన ప్రశ్నిస్తే అరెస్టులు చేయిస్తున్నారు.. పాలిటెక్నిక్ విద్యార్థులకు అన్యాయం జరిగేలా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసేందుకు తీసుకొచ్చిన జీఓ 97ను రద్దుచేయాల్సిందేనని బీఆర్ఎస్ శాసన సభ ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్రావు డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ లోని పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసనకు సంఘీభావం తెలిపేందుకు వస్తున్న హరీష్ రావును హనుమకొండ కలెక్టరేట్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. అంతకు ముందు గురువారం ఉదయం ఆయనను హైదరాబాద్లోని కోకాపే ట నివాసంలో గృహనిర్బంధం చేశారు. ఈ రెండు సందర్భాల్లోనూ పాలిటెక్నిక్ విద్యార్థులకు మద్దతు పలికిన ఆయన ప్రభుత్వవిధానాల పై మండిపడ్డారు. గృహ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, గృహనిర్బంధాలు, జైళ్లు, అరెస్టులు తనకు కొత్త కాదని చెప్పారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు బేడీలు వేయించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థి గొంతు పిసికిన సీఐపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే, వారి గొంతు నొక్కి అరెస్టులు చేస్తున్నారని హరీష్ రావు రేవంత్ పాల నపై ధ్వజమెత్తారు. విద్యార్థులతో మాట్లాడేందుకు వెళ్తున్న క్రమంలో హనుమకొండ కలెక్టరేట్ వద్ద రిటైర్డ్ ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న తనను పోలీసులు అరెస్టు చేసి, బలవంతంగా పోలీస్ స్టేషన్కు తరలించడం ఎంతవరకు సమంజసమని ఆయనప్రశ్నించారు. ఉద్యోగులు తెలంగాణ ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని, ఆనాడు ముఖ్యమంత్రి కేసీఆర్ 73శాతం ఫిట్మెంట్తోపాటు అదనంగా ఒక ఇంక్రిమెంట్ ఇస్తే రేవంత్రెడ్డి ప్రభుత్వం వారి సమస్యలను కూడా పట్టించుకోవడం లేదంటూ విమర్శించారు.

**రాజగురువు చంద్రబాబును చూసైనా నేర్చుకోండి**

మీ రాజగురువు చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్లో పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసిన తర్వాత విద్యార్థులకు న్యాయం జరగకపోవడంతో ఎందుకు స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేశామని మదన పడుతున్నారు. ఆయన్ను చూసైనా.. నేర్చుకోమంటూ రేవంత్రెడ్డికి హితవు పలికారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడంపై ప్రైవేట్ పరమవుతుం దని, 15వేల రూపాయలతో పూర్తి చేసే పాలిటెక్నిక్ విద్య విద్యార్థులకు భారంగా మారుతుందని, అందుకే ఢిల్లీలో కూడా స్కిల్ యూనివ ర్సిటీలో విలీనం జీఓను రద్దు చేశారని గుర్తు చేశారు. రేవంత్రెడ్డి ఇంజనీరింగ్ విద్య వేస్ట్ అని చెబుతుండటంతో, ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా సీఎం రేవంత్రెడ్డి వేస్ట్ అంటూ బాహాటంగానే విమర్శిస్తున్నారన్నారు. వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రధాన గేట్కు పోలీసులు తాళం వేసి మధ్యాహ్నం ఒంటి గంటవరకు కూడావిద్యార్థులు భోజనాలకు వెళ్లకుండా అడ్డుకున్నారని హరీష్ రావు మండిపడ్డారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే జీఓ 97ను రద్దు చేయకపోతే సెప్టెంబర్ 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీష్ రావు హెచ్చరించారు.

**హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత... హరీష్ అరెస్టు**

పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు గురువారం హరీష్ రావు వస్తున్నారనే ముందస్తుగానే ప్రకటించడంతో పెద్దఎత్తున పోలీస్ బలగాలను మోహరించారు. వరంగల్ వైపు బయలుదేరిన హరీష్ రావును పోలీసులు అడుగడుగున అడ్డుకుంటూ రాగా, హను వ ఎకొండలో ఓ వివాహ వేడుకకు హాజరవుతున్నానని చెప్పడంతో ముందుకు పోయేందుకు అనుమతించారు. మార్గమధ్యంలో హనుమకొండ కలెక్టరేట్ ఎదురుగా తమసమస్యల పరిష్కారం కోసం రిటైర్డ్ ఉద్యోగులు చేస్తున్న నిరసనకు హరీష్ రావు మద్దతు తెలుపుతుం డగానే.. పోలీసులు వచ్చి హరీష్ రావును బలవంతంగా అరెస్టు చేసేం దుకు ప్రయత్నించారు. ఈ దశలో పోలీసులకు, బీఆర్ఎస్ నాయకుల – మధ్య తోపులాట జరిగింది. తనను ఎందుకు అరెస్టు చేస్తున్నారంటూ హరీష్ రావు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. అరగంట పాటు కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. హరీష్ రావును, మిగత నాయకులను అరెస్టు చేయడంతో కలెక్టరేట్ నుంచి సుబేదారి పోలీస్ స్టేషన్ వరకు వాహనాల్లో కాకుండా నడుచుకుంటూ వెళ్లారు. అరెస్టు అయిన వారిలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్రావు, సత్యవతిరాథోడ్, డాక్టర్ తాటికొండ రాజయ్య, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, ఒడితెల సతీష్ బాబు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు. అంతకు ముందు హనుమకొండ లో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ను పాలిటెక్నిక్ కళాశాల వద్దకు వెళ్లకుండా గృహ నిర్బంధం చేశారు. అదేవిధంగా పాలిటెక్నిక్ కళాశాల వద్దకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, డాక్టర్ హరిరమాదేవిని, సుశాంతను అరెస్టుచేసి మట్టేవాడ పోలీస్ స్టేషన్కు తరలించారు. కాగా, గృహ నిర్బంధంలో ఉన్న హరీష్ రావుతో 22ఏ నిషేధిత జాబితాల్లో స్థలాలు కోల్పోతున్న ఇబ్రహీం పట్నం, రాందాసుపల్లె బాధితులు సమావేశమయ్యారు. రైతుల పక్షాన క్షేత్రస్థాయి పోరాటాల్లో పాల్గొననున్నట్లు హరీష్ రావు స్పష్టం చేశారు.

**హన్మకొండలో బిఆర్ఎస్ ధర్నా**

బీఆర్ఎస్ ఎల్పీఉప నేత తన్నీరు హరీష్ రావును హనుమకొండ సుబేదారి లో పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. అలాగే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లాలో జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించారు. అలాగే వరంగల్, హనుమకొండలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన

**జీవో నంబర్ 97ను రద్దు చేయాలి**
**తెలంగాణలో విద్యా విధ్వంసంపై రాహుల్ గాంధీ నోరు విప్పాలి**
**బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు**
**రామంతాపూర్ పాలిటెక్నిక్ కాలేజీలో దీక్షా శిబిరానికి వెళుతుండగా హౌస్ అరెస్ట్**



**హైదరాబాద్, ఆగస్టు 27 :** రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన కొనసాగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. సమస్యలపై గళమెత్తే ప్రతిపక్షాలు, విద్యార్థులపై పోలీసు నిర్బంధాలను ప్రయోగిస్తోందని విమర్శించారు. రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల దీక్షకు మద్దతు తెలిపేందుకు బయలు దేరుతున్న రాంచందర్‌రావును ఓయూ పోలీసులు తార్నాకలోని ఆయన నివాసంలో గృహ నిర్బంధం చేశారు. దాంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. వారిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎంపీ ఈటల రాజేందర్.. రాంచందర్‌రావు నివాసానికి చేరుకుని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ తనను గృహ నిర్బంధం చేయడం ప్రభుత్వ పిరికితనానికి పరాకాష్ఠ అని మండిపడ్డారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కుప్పకూలిపోయిందన్నారు. ప్రభుత్వం జీవో 97తో పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని, ఈసెట్‌ను రద్దు చేసే కుట్ర జరుగుతోందన్నారు. శక్తి స్కీమ్ పేరుతో వింత ప్రయోగాలు చేస్తూ, పాలిటెక్నిక్ విద్యార్థుల చదువును అవమానిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిపలు సక్రమంగా ఇవ్వకుండా వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తిరుగుతూ డ్రామాలు ఆడడం మానేసి, తెలంగాణలో విద్యా విధ్వంసంపై నోరు విప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు సాధించేవరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

**కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి: ఈటల**

కాంగ్రెస్ పాలనపై రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, ఈ ప్రభుత్వం ఎప్పుడు కూలుతుందా అని ఎదురుచూస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. 1965లో ఏర్పడిన కాలనీలు, అక్కడ కట్టిన అపార్ట్‌మెంట్లను ఇవాళ 22ఏ జాబితాలో చేర్చారన్నారు. దీంతో తమ పిల్లల విదేశీ చదువులు, ఆడపిల్లల పెళ్లిళ్లకు బ్యాంకు రుణాల కోసం వెళ్తే.. 'మీ ఆస్తి 22ఏ కింద ఉంద'ని చెబుతున్నారని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

# నేపాల్ విలయంతో భారత్‌కు హెచ్చరిక

**చైనా నిర్మిస్తున్న డ్యామ్‌తో భారత్‌కు ముప్పే**

**బ్రహ్మపుత్రపై చైనా డ్యామ్ ప్రకృతి విలయానికి నాంది**

**ఆందోళన వ్యక్తం చేస్తున్న నిపుణులు**




**న్యూఢిల్లీ:** నేపాల్ విలయం తరవాత ఇప్పుడు భారత్‌కూ ఇలాంటి ముప్పే పొంచి ఉందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే అది చైనా వల్లనే అని తెలుస్తోంది. బ్రహ్మపుత్రపై చైనా నిర్మిస్తున్న భారీ డ్యామే. బీజింగ్‌తో మనకు నదీజల వివాద పరిష్కార ఒప్పందాలు, యంత్రాంగం లేవు. బ్రహ్మపుత్రలో ప్రవాహ హెచ్చుతగ్గులు, వర్షపాతం వంటి సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికైతే ఒక అవగాహనా ఒప్పందం ఉంది. దాన్ని అయిదేళ్లకు ఒకసారి పునరుద్ధరించవచ్చు. ఒకవేళ డ్యామ్ నిర్మాణం తర్వాత చైనా దాన్ని పునరుద్ధరించకపోతే.. భారత్‌కు పెను సమస్యగా మారుతుంది. దీనికి తోడు ఈ నిర్మాణం చేపట్టే ప్రాంతంలో ప్రకృతి విపత్తులకూ ఆస్కారం ఎక్కువే. అందువల్ల భవిష్యత్తులో ఈ నదిలో టిబెట్ వైపు ఏదైనా విపత్తు సంభవిస్తే.. చైనా దాన్ని భారత్‌కు చేరవేయకపోతే ఈశాన్య రాష్ట్రాలు వరదల్లో మునిగే ప్రమాదం ఉంది. బ్రహ్మపుత్ర నదిని టిబెట్‌లో యార్లంగ్ జాంగ్పో అంటారు. ఈ నదిపైనే చైనా ఏకంగా 167 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో భారీ జలవిద్యుత్తు ప్రాజెక్ట్ నిర్మిస్తోంది. ఇందుకోసం డ్యామ్ నిర్మాణం చేపడుతోంది. చైనా గతంలో నిర్మించిన ప్రపంచంలో అతిపెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్‌కన్నా ఇది మూడురెట్లు భారీది. బ్రహ్మపుత్ర నది 'గ్రేట్ బెండ్'గా పిలిచే భారీ వంపు ప్రాంతంలో నీరు రెండువేల మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. స్వల్పదూరంలో పైనుంచి పడటంవల్ల అక్కడ జల విద్యుత్తు ఉత్పత్తి ఎక్కువగా చేయొచ్చు. ఏటా 60వేల మెగావాట్ల విద్యుత్‌ను ఇది ఉత్పత్తి చేయగలదని చైనా చెబుతోంది. అయితే, ఈ నిర్మాణ ప్రాంతమే ఇప్పుడు భారత్‌కు సమస్యగా మారింది. ఈ ప్రాజెక్ట్‌పై ఆ మధ్య చైనా జియలాజికల్ సర్వే పర్యవేక్షణలో ఓ అధ్యయనం జరిగింది. ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న ప్రాంతం అడుగు భాగంలోనే 'పైజెన్ ఫాల్ట్' (పగులు) ఉందని, ఇది అక్కడున్న రాళ్లను చీల్చుతున్నట్లుగా అందులో గుర్తించారు. ఈ బీటలు జల విద్యుత్ ప్రాజెక్టు సమీపంలో నిర్మించే డ్యామ్‌లు, రోడ్లు, వంతెనలు, సొరంగాల వంటి మౌలిక సదుపాయాలను గణనీయంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల భూకంపాలు సంభవిస్తే ఇక్కడ పరిస్థితిని అంచనా వేయడం కూడా కష్టమేనని నిపుణులు పేర్కొంటున్నారు. బ్రహ్మపుత్ర నదిపై భారత్‌లో కోట్లాది మంది ప్రజల జీవనం ఆధారపడి ఉంది. అస్సాం, అరుణాచల్ రాష్ట్రాల ప్రజలకు ఈ నదే ప్రాణాధారం. మామూలుగానే ఏటా బ్రహ్మపుత్రలో వరదల కారణంగా ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పుడు చైనా ఈ డ్యామ్‌ను నిర్మించిన తర్వాత.. ఇరు దేశాల మధ్య ఘర్షణలు తలెత్తి మెగా డ్యామ్ నుంచి ఒక్క పెట్టున అపార జలరాశిని విడుదలచేస్తే అది మన ఈశాన్య రాష్ట్రాల్లో విలయం సృష్టించే ప్రమాదం ఉంది. మరోవైపు, డ్యామ్ నిర్మాణం వల్ల బ్రహ్మపుత్రలో ప్రవాహం తగ్గిపోయినా పర్యవసానాలు తీవ్రంగానే ఉంటాయి. చైనా దిగువకు నీటికి విడుదల చేయకపోయినా.. నదిలో నీటి లభ్యత తగ్గితే సాగునీటికీ, తాగునీటికీ ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందుకే బీజింగ్ మెగా డ్యామ్ సమస్యను ఎదుర్కొనేందుకు భారత్ కూడా 11వేల మెగావాట్ల సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సిద్ధమైంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని సియాంగ్ నదిలో నిర్మించతలపెట్టిన ఈ డ్యామ్.. ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు సాయపడుతుంది. కొందరు భూగర్భ శాస్త్రవేత్తలు దీన్ని డ్యామ్ అని కాకుండా 'వాటర్ బాంబ్' అని పిలుస్తున్నారు. చైనా ఆధీనంలోని టిబెట్ అటానమస్ రీజియన్‌లోని ఈ ఆనకట్ట నిర్మాణం జరుగుతోంది. అయితే ఈ రీజియన్ ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తాయి. ఒకవేళ డ్యామ్ నిర్మించాక భూకంపం ఏర్పడితే భారత్, బంగ్లాదేశ్‌లపై తీవ్ర ప్రభావం పడుతుంది. భూకంపాల కారణంగా భారీ వరదలు ఏర్పడతాయి. అందుకే మైడాగ్ డ్యామ్ భారత్‌కు వాటర్ బాంబ్‌లాగా మారనుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మైడాగ్ డ్యామ్ విషయంలో భారతీయులు మాత్రమే ఆందోళన చెందడం లేదు. చైనా భూగర్భ శాస్త్రవేత్తలూ ఈ ఆనకట్టపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే బ్రహ్మపుత్ర జలాలు చైనా ఆధీనంలోకి వెళ్లిపోతాయి. చైనా జలాలను ఎక్కువ కాలం నిల్వ ఉంచి ఒకేసారి విడుదల చేస్తే ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వరదలు ఏర్పడతాయి. మరోవైపు సమ్మర్ లాంటి సీజన్లలో చైనా అసలు జలాలనే విడుదల చేయకపోతే నీటి ఎద్దడి నెలకొంటుంది. అయితే ఈ ముప్పు నుంచి తప్పించుకోవడానికి భారత్ కూడా ఓ మెగా ప్రాజెక్టును నిర్మించ తలపెట్టిందని సమాచారం.

# నేపాల్ వరదల్లో 300 మంది భారతీయుల గల్లంతు

**విషాదంలో 359కు పెరిగిన మృతుల సంఖ్య**

**ఖాట్మండ్ :** నేపాల్ ప్రకృతి విలయంలో గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ జలప్రళయంలో 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ గురువారం వెల్లడించారు. ఈ విషాదంలో మృతుల సంఖ్య 359కు పెరిగింది. నేపాల్ లోని విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం.. ఈ ఆకస్మిక వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతయ్యింది. వారిలో 85 మంది భద్రతా సిబ్బంది కాగా.. 162 మంది వివిధ హైడ్రోపవర్ కేంద్రాల్లో పనిచేస్తోన్న ఉద్యోగులు ఉన్నారు. 579 పర్యాటకులు ఉన్నారని ఆ సంస్థ పేర్కొంది. వేలమంది నిరాశ్రయులయ్యారు. ఈ భారీ విపత్తు తీవ్రతను అంచనా వేస్తున్నాం అని ఖనాల్ పేర్కొన్నారు. అటు టిబెట్ వైపు 588 మంది గల్లంతయ్యారు. వారిలో 260 మంది విదేశీయులే. హిమాలయాల్లో కరిగిన మంచు జలవనరుల్లో నీటి మట్టాలను పెంచుతుందని, ఇప్పుడు మనందరం చూసింది అదేనని నేపాల్ మంత్రి అన్నారు. ఈ వరద మరింత దిగువకు ప్రవహించి ఉంటే.. భారత రాష్ట్రాలపైనా ప్రభావం పడేదని తెలిపారు. గతంలోనూ ఇలా జరిగిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. భారత్, చైనా, నేపాల్, భూటాన్ పర్యావరణపరంగా అనుసంధానమై ఉన్నాయని, ఈ దేశాలు తమ విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు సంభవించిన వరద గురించి చైనాకు ముందే తెలిసినా నేపాల్‌ను అప్రమత్తం చేయలేదని తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి స్పందన వచ్చింది. ఈ వరదల్లో ఈశా ఫౌండేషన్‌కు చెందిన దాదాపు 80 మంది గల్లంతైన సంగతి తెలిసిందే. దీనిపై సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. సహాయక చర్యల్లో సహకరించేందుకు తనతోపాటు మరికొంతమంది వాలంటీర్లను అనుమతించాలని చైనా అధికారులను కోరారు. ప్రకృతి విపత్తుతో అల్లకల్లోమైన హిమాలయ దేశానికి భారత్ ఆపన్న హస్తం అందించింది. రెండు విమానాల్లో 47.5 టన్నుల సహాయక సామగ్రితో పాటు రెస్క్యూ బృందాలను ఖాట్మండూకు పంపింది.



## ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు

**80 మంది సంస్థ యాత్రికులు వరదల్లో గల్లంతు**

**కన్నీటి పర్యంతం అయిని జగ్గీవాసుదేవ్**

**చెన్నై :** ఈశా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు నేపాల్ వరదల్లో గల్లంతైన నేపథ్యంలో సంస్థలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సద్గురు అనుచరులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. సాధారణంగా నవ్వుతూ కనిపించే సద్గురు జగ్గీ వాసుదేవ్ కూడా దుఃఖాన్ని అణుచుకోలేక పోయారు. కైలాశ్ యాత్ర అనంతరం ఈశా ఫౌండేషన్ యాత్రికులు టిబెట్‌లోని గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్న సమయంలో వరద ముంచెత్తినట్టు తెలుస్తోంది. టిబెట్‌లో జరిగిందని చెబుతూ సద్గురు కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం అక్కడికి వెళదామనుకున్నా కుదరలేదని చెప్పారు. గల్లంతైన వారి గురించి ఇప్పటివరకూ తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని అన్నారు. పరిస్థితి చాలా దారుణంగా కనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్‌లో ఈశా యాత్రికుల బృందం ఉన్న సమయంలో ఆ ప్రాంతాన్ని వరద ముంచెత్తిందని చెప్పారు. తాము ఇమిగ్రేషన్ సెంటర్‌కు వచ్చినట్టు ఈశా గ్రూప్ లీడర్ ప్రవీణ్ నుంచి తనకు ఉదయం 9.05 గంటలకు మెసేజీ వచ్చిందని సద్గురు చెప్పారు. ఆ తరువాత 9.14కు ఆ భవన సముదాయాన్ని వరద ముంచెత్తిందని అన్నారు. గ్రూప్ లీడర్ ప్రవీణ్‌తో ఈశా ఫౌండేషన్ రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందని చెబుతూ కన్నీటిపర్యంత మయ్యారు. కొన్ని క్షణాలకు తేరుకున్న ఆయన మళ్లీ మాట్లాడుతూ ప్రవీణ్ వద్ద ఉన్న నేపాల్ ఫోన్ నెంబర్ ఆ రోజంతా యాక్టివ్‌గా లేదని చెప్పారు. 'ఆయన దాటి వచ్చి ఉంటే నేపాల్ ఫోన్ యాక్టివ్ అయ్యి ఉండేది. కానీ అలా జరగలేదు. అంటే, గ్రూప్ మొత్తం ఇమిగ్రేషన్ సెంటర్‌లోనే ఉండి ఉంటుంది' అని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాను మరికొంత మందితో కలిసి అక్కడికి వెళ్లేందుకు భారత్, చైనాల అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టిబెట్‌లో మంచుచరియలు విరిగిపడటంతో అక్కడి నదిలో పోటెత్తిన వరద దిగువ ఉన్న నేపాల్‌లో జలప్రయళం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో 170 మంది మరణించగా, 1500 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనలో గల్లంతైన భారతీయుల్లో 100 మంది ఆచూకీ తెలిసినట్టు సమాచారం.

# భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించడం కుదరదు

**పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య బానిస కాదు**

**పెళ్లంటే పరస్పర గౌరవంతో బతికే బంధం**

**పనిమానిషిగా చూడాలనుకునే తీరు క్షమార్హం కాదు**

**కర్నాటక హైకోర్టు సంచలన వ్యాఖ్యలు**

**బెంగళూరు :** వివాహ బంధంలో భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య ఇంటి పనులు చేయాలి, అత్తమామలను తప్పనిసరిగా చూసుకోవాలి, పుట్టింటికి వెళ్లాలంటే భర్త అనుమతి తీసుకోవాలనే నిబంధన ఏదీ లేదని పేర్కొంది. వివాహం అంటే పరస్పర గౌరవం, నమ్మకం, సమానత్వంతో కొనసాగాల్సిన బంధమని కోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ చిల్లకూరు సుమలత ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని కోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. బెంగళూరు రూరల్ జిల్లాకు చెందిన సతీష్ అనే వ్యక్తి తన భార్య, కుమార్తెకు కుటుంబ న్యాయస్థానం నెలకు రూ.9,000 చొప్పున భరణం చెల్లించాలని ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తన తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, తన అనుమతి తీసుకోకుండానే తరచూ పుట్టింటికి వెళ్తోందని అతడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ వాదనలపై కోర్టు తీవ్రంగా స్పందించింది. భర్త చేసిన ఆరోపణలను పరిశీలిస్తే భార్యను కుటుంబ సభ్యురాలిగా కాకుండా ఇంటి పనుల కోసం ఉంచుకున్న వ్యక్తిగా భావిస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. భార్య తన తల్లిదండ్రులను కలవడానికి పుట్టింటికి వెళ్లాలంటే భర్త లేదా అత్తమామల అనుమతి తీసుకోవాలనే ఆలోచనను కోర్టు ప్రశ్నించింది. ఒక మహిళ తన తల్లిదండ్రులను కలవడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భార్య ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలి అనే విషయాలను పూర్తిగా భర్త నియంత్రించడం సరైన పద్ధతి కాదని కోర్టు పేర్కొంది. ఇలాంటి ఆంక్షలు మహిళ వ్యక్తిగత స్వేచ్ఛను దెబ్బతీసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇంటి పనులన్నీ భార్యే చేయాలనే భావన సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ జీవితంలో భార్యాభర్తలు ఇద్దరూ బాధ్యతలను పరస్పరం పంచుకోవాలని పేర్కొంది. అలాగే వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా వారి సొంత పిల్లలపై ఉంటుందని కోర్టు తెలిపింది. అత్తమామలను చూసుకోవడాన్ని కోడలిపై తప్పనిసరి బాధ్యతగా మోపడం సమంజసం కాదని స్పష్టం చేసింది. కోడలు అత్తమామల కు సేవ చేయడం ఆమె ఇష్టంతో జరగాలి తప్ప, బలవం తం చేయడం సరికాదని పేర్కొంది. వివాహ బంధం కేవలం కొన్ని ఆచారాలు, సంప్రదాయాలతో ఏర్పడే సంబంధం కాదని కోర్టు పేర్కొంది. భార్యాభర్తల మధ్య ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం, సహకారం ఉండాలని తెలిపింది. లింగం ఆధారంగా మహిళల స్వేచ్ఛను పరిమితం చేయడం రాజ్యాంగం అందించే సమానత్వ సూత్రాలకు విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. భార్య, కుమార్తెకు రోజుకు రూ.150 చొప్పున కూడా భరణం చెల్లించలేనని భర్త చేసిన అభ్యర్థనను కోర్టు కొట్టివేసింది.

# ఖేలో ఇండియా సంవాద్

**దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం**

**క్రీడాకారులకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు**

**న్యూఢిల్లీ:** దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారంనిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అ÷-లథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిధ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

# యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

**మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి**

**ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు**

**ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ**

**తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్**

**న్యూఢిల్లీ :** లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

# వీసా ఇంటర్వ్యూల నిలిపివేత

**భారతీయ విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఇక్కట్లు**

**వాషింగ్టన్ :** అమెరికాలో చదువుకోవాలని, ఉద్యోగం చేయాలని లేదా అక్కడే కెరీర్ కొనసాగించాలని భావిస్తున్న భారతీయులకు మరోసారి అనిశ్చితి ఎదురైంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను నిలిపివేసి రీషెడ్యూల్ చేయనున్నట్టు అమెరికా తాజాగా ప్రకటించింది. అమెరికా కాన్సులర్ అధికారులకు కొత్త శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ మార్పులు చోటుచేసు కున్నాయి .వీసా దరఖాస్తుదారులను మరింత క్షుణ్ణంగా పరిశీలించడం, ముఖ్యంగా వారు అమెరికా ప్రభుత్వ ప్రజా సంక్షేమ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉందా అనే అంశాన్ని అంచనా వేయడంపై అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు నివేదికలు చెబుతున్నాయి. ఈ శిక్షణ కోసం కొన్ని వీసా అపాయింట్ మెంట్లను మార్చుతున్నారు. ఇప్పటికే ఇంటర్వ్యూ తేదీలు పొందిన కొంతమంది దరఖాస్తుదారులకు కూడా అపాయింట్‌మెంట్లు రద్దు చేసి, కొత్త తేదీని తర్వాత తెలియజేస్తామని సమాచారం అందించారు. అపాయింట్‌మెంట్ టైమ్‌లైన్లలో మార్పులు రావడంతో అమెరికా వెళ్లే ప్రణాళిక గతంలో కంటే మరింత జాగ్రత్తగా చేయాల్సిన అవసరం ఏర్పడింది.

# జన్‌ధన్ డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లు

**59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను తెరిచిన ప్రజలు**

**వివరాలను వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ**

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లకు చేరాయి. 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను ప్రజలు తెరిచారు. ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. ఇది బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పేర్కొన్నారు. మొత్తం ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, నగర ప్రాంతాల్లో ఉండగా.. అందులో 56 శాతం ఖాతాలు మహిళల పేరిటే ఉండటం విశేషం. ఖాతాదారులకు ఇప్పటివరకూ 41.29 కోట్లకు పైగా రూపే డెబిట్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఖాతాల ద్వారా ఉచిత ప్రమాదబీమా, పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నారు. కనీస మొత్తం లేకుండానే రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ముద్రా రుణాలు అందిస్తున్నారు. జన్ ధన్-ఆధార్- మొబైల్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకే జమ అవుతున్నాయి. 2014 ఆగస్టు 28న ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఖాతాల వల్ల ప్రజలు భద్రంగా డబ్బు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులువు అవుతుంది. జన్‌ధన్ ఖాతాలను కనీస నిల్వ లేకుండానే నిర్వహించుకోవచ్చు.. కానీ చెక్కు సౌకర్యం కావాలంటే మాత్రం ఖాతాలో కనీస బ్యాలన్స్ తప్పనిసరి నిబంధన విధించారు.

# రెండో టెస్టు డ్రా..
# గిల్ సేనదే సిరీస్




**భారత్ విజయానికి అడ్డుగోడలా దినుష.**

**ఫాలో ఆన్ ఆడినా అద్భుత పోరాటంతో రెండో టెస్టును డ్రా చేసుకున్న శ్రీలంక**

**అజేయ సెంచరీతో జట్టును ఆదుకున్న యువ కెరటం సోనల్ దినుష**

**తొలి ఇన్నింగ్స్‌లో పడిక్కల్, ధ్రువ్ జురెల్ శతకాలతో భారత్ భారీ స్కోరు**

**బౌలర్లకు సహకరించని పిచ్‌పై లంక బ్యాటర్ల అద్వితీయ నిలకడ**

**ఈ సిరీస్‌లో మూడు సెంచరీలతో దినుష, 16 వికెట్లతో మానవ్ సుతార్ టాప్ పెర్ఫార్మర్లు**

శ్రీలంక యువ బ్యాటర్ సోనల్ దినుష అద్భుతమైన ప్రతిఘటనతో భారత్ విజయానికి అడ్డుగోడలా నిలిచాడు. ఓటమి అంచున నిలిచిన జట్టును తన వీరోచిత సెంచరీతో ఆదుకుని, రెండో టెస్టును డ్రాగా ముగించడంలో కీలక పాత్ర పోషించాడు. ఫాలో ఆన్‌లో రెండో ఇన్నింగ్స్ ఆడిన శ్రీలంక, ఓటమి ఖాయమనుకున్న దశలో దినుష (133 నాటౌట్) అసాధారణ పోరాటపటిమతో భారత్ కు సవాలుగా నిలిచాడు. అతనికి ఇతర బ్యాటర్లు చక్కటి సహకారం అందించడంతో, కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలుపు ఆశలు గల్లంతయ్యాయి. మ్యాచ్ చివరి రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 429 పరుగులు చేసింది. అప్పటికే లంక ఆధిక్యం 216 పరుగులకు చేరింది. ఇవాళ ఆటకు చివరి రోజు కాగా, టీమిండియా గెలిచే అవకాశం లేకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అద్భుతమైన ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను కాపాడుకున్న సోనల్ దినుషను భారత ఆటగాళ్లు, కోచ్ గౌతమ్ గంభీర్ ప్రత్యేకంగా అభినందించారు.

### ఫాలో ఆన్‌లో లంక పోరాటం


ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 503 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. దేవదత్ పడిక్కల్ (117), ధ్రువ్ జురెల్ (115) సెంచరీలతో కదం తొక్కగా, యశస్వి జైస్వాల్ (45), శుభ్‌మన్ గిల్ (50), రిషభ్ పంత్ (63) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక 290 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్ల ధాటికి లంక బ్యాటర్లు చేతులెత్తేయగా, సోనల్ దినుష (103), పసిందు సూరియబండార (80) మాత్రమే రాణించారు. దీంతో భారత్‌కు 213 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. భారీ ఆధిక్యంతో శ్రీలంకను ఫాలో ఆన్‌కు ఆహ్వానించిన భారత్‌కు ఆతిథ్య జట్టు ఊహించని షాక్ ఇచ్చింది. రెండో ఇన్నింగ్స్‌లో లంక బ్యాటర్లు అద్భుతమైన పోరాటాన్ని ప్రదర్శించారు.

పసిందు సూరియబండార (92), కమిందు మెండిస్ (55) రాణించగా, సోనల్ దినుష మరోసారి శతకంతో కదంతొక్కాడు. ఈ సిరీస్‌లో అతనికి ఇది మూడో సెంచరీ కావడం విశేషం. దినుషకు కేశర నువంత (46) తోడవడంతో లంక ఓటమి నుంచి గట్టెక్కింది. లంక టెయిలెండర్లు దాదాపు 90 ఓవర్ల పాటు క్రీజులో నిలబడి భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. బ్యాటింగ్‌కు పూర్తిగా అనుకూలించిన పిచ్‌పై భారత బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. భారత బౌలర్లలో ఈ సిరీస్ మొత్తం మీద మానవ్ సుతార్ 16 వికెట్లతో అగ్రస్థానంలో నిలవగా, లంక బౌలర్లలో అసిత్ ఫెర్నాండో 10 వికెట్లు పడగొట్టాడు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది.

#### లంకపై టెస్ట్ సిరీస్ గెలిచినా

## డబ్ల్యూటీసీలో టీమిండియా స్థానం అదే!

శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-0 తేడాతో కైవసం చేసుకుంది. అయితే, ఈ విజయం టీమిండియాకు పూర్తిస్థాయి ఆనందాన్ని ఇవ్వలేకపోయింది. కొలంబో వేదికగా జరిగిన రెండో టెస్టు డ్రాగా ముగియడంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఈ డ్రా కారణంగా విలువైన పాయింట్లు కోల్పోయిన శుభ్‌మన్ గిల్ సేన, పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలోనే నిలిచిపోయింది. సిరీస్ గెలిచినప్పటికీ, పట్టికలో పురోగతి సాధించలేకపోవడం జట్టును నిరాశపరిచింది. రెండో టెస్టు ప్రారంభానికి ముందు 53.33 పాయింట్ల శాతంతో (పీసీటీ) ఉన్న భారత్, ఈ డ్రా ఫలితంతో 51.52 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పట్టికలో 2023 విజేత ఆస్ట్రేలియా (80%), 2025 విజేత దక్షిణాఫ్రికా (75%), 2021 ఛాంపియన్ న్యూజిలాండ్ (72.22%), బంగ్లాదేశ్ (55.56%) తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. వారి తర్వాత భారత్ ఐదో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు, ఈ మ్యాచ్‌ను విజయవంతంగా డ్రా చేసుకున్న శ్రీలంక 33.33 పీసీటీతో ఆరో స్థానంలో ఉంది. ఎస్ఎస్‌సీ మైదానంలో జరిగిన రెండో టెస్టులో చివరి రోజు భారత్ గెలుపు ఖాయమనిపించింది. కానీ, శ్రీలంక బ్యాటర్ సోనల్ దినుష (133 నాటౌట్) అద్భుతమైన పోరాట పటిమతో వీరోచిత శతకం బాది టీమిండియా ఆశలపై నీళ్లు చల్లాడు. 16 పరుగుల స్వల్ప ఆధిక్యంతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన లంక, తొలి సెషన్‌లోనే వికెట్ నష్టపోకుండా 100 పరుగులు జోడించింది. దినుషకు కేశర నువంత (46) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. భోజన విరామం తర్వాత మానవ్ సుతార్, రవీంద్ర జడేజా చెరో వికెట్ పడగొట్టినా, క్రీజులో పాతుకుపోయిన దినుష పట్టు వదల్లేదు. లహిరు కుమారతో కలిసి మ్యాచ్‌ను డ్రా దిశగా నడిపించాడు. భారత బౌలర్లు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరికి కెప్టెన్ శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ వంటి పార్ట్‌టైమ్ బౌలర్లు బౌలింగ్ చేశారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చివరకు ఇరుజట్ల కెప్టెన్ల అంగీకారంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. ఇప్పటికే తమ డబ్ల్యూటీసీ సైకిల్‌లో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌తో సిరీస్‌లు పూర్తి చేసుకున్న భారత్‌కు రాబోయే సిరీస్‌లు అత్యంత కీలకం కానున్నాయి. ఈ ఏడాది నవంబర్‌లో న్యూజిలాండ్‌తో వారి గడ్డపై రెండు టెస్టులు, ఆ తర్వాత స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించాలంటే ఈ సిరీస్‌లలో అసాధారణ ఆటతీరుతో అత్యుత్తమ ప్రదర్శన కనబరచడం టీమిండియాకు తప్పనిసరి.




## తండ్రుల బాటలోనే..

### భారత అండర్-19 జట్టులోకి సెహ్వాగ్, ద్రవిడ్ కుమారులు

భారత క్రికెట్ దిగ్గజాలు విరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్ వారసులు మరోసారి వార్తల్లో నిలిచారు. ఆస్ట్రేలియా అండర్-19తో జరగనున్న సిరీస్‌కు భారత జట్టులో ఆర్యవీర్ సెహ్వాగ్, అన్వయ్ ద్రవిడ్‌కు చోటు దక్కింది. భారత్-ఆస్ట్రేలియా అండర్-19 జట్ల మధ్య మూడు వన్డేలు జరగనున్నాయి. సెప్టెంబర్ 18, 21, 23 తేదీల్లో రాజ్‌కోట్‌లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత నాలుగు రోజుల మ్యాచ్‌లు రెండు ఉంటాయి. సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు రాజ్‌కోట్‌లో తొలి మ్యాచ్ జరుగుతుంది. అక్టోబర్ 5 నుంచి 8 వరకు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం 'బి' గ్రౌండ్‌లో రెండో మ్యాచ్ ఉంటుంది. వన్డే జట్టుకు లక్ష్య రైచందాని కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. యశ్వర్ధన్ చౌహాన్ వైస్ కెప్టెన్‌గా ఉంటాడు. రెడ్‌బాల్ మ్యాచ్‌లకు చౌహాన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. రైచందాని వైస్ కెప్టెన్‌గా కొనసాగుతాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ ప్రస్తుతం ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వెస్ట్ ఢిల్లీ లయన్స్‌కు ఆడుతున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడాడు. అన్వయ్ ద్రవిడ్ ఇటీవల శ్రీలంక పర్యటనలో రెండు వన్డేలు ఆడి 101 పరుగులు చేశాడు. వన్డే జట్టులో ఆర్యవీర్, అన్వయ్‌తో పాటు మనల్ చౌహాన్, చిగురుపాటి వెంకటకు చోటు లభించింది. సాగర్ విర్క్, అన్మోల్‌జీత్ సింగ్, ఇషాన్ సూద్ వన్డే జట్టులో లేరు.

## న్యూజిలాండ్‌లో టీమిండియా పర్యటనకు భారీ క్రేజ్

### 48 గంటల్లోనే 26 వేల టికెట్ల అమ్మకం




టీమిండియా న్యూజిలాండ్ పర్యటనకు ఇప్పటినుంచే భారీ క్రేజ్ కనిపిస్తోంది. న్యూజిలాండ్ క్రికెట్ అంతర్జాతీయ సీజన్ టికెట్ విక్రయాలు రికార్డు స్థాయిలో ప్రారంభమయ్యాయి. క్రికెట్ నేషన్ సభ్యుల ప్రీ-సేల్ మొదలైన 48 గంటల్లోనే 26 వేల టికెట్లు అమ్ముడయ్యాయి. భారత్ అక్టోబర్‌లో న్యూజిలాండ్‌లో పర్యటించనుంది. 12 మ్యాచ్‌ల సుదీర్ఘ మల్టీ-ఫార్మాట్ సిరీస్‌లో భాగంగా టీ20లు, వన్డేలు, టెస్టులు జరగనున్నాయి. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో జరిగే పరిమిత ఓవర్ల మ్యాచ్‌లకు టికెట్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. క్రైస్ట్‌చర్చ్‌లోని 9 వేల సీట్ల హాగ్లీ ఓవల్‌కు కూడా టికెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అక్టోబర్ 22, 24 తేదీల్లో జరిగే తొలి రెండు టీ20లకు ఈ స్టేడియం పూర్తిగా నిండిపోయే అవకాశం ఉంది. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు జరిగే రెండో టెస్టుకు కూడా భారీ స్పందన వస్తోంది. వెల్లింగ్టన్‌లోనూ టికెట్లకు డిమాండ్ పెరిగింది. హెచ్ఎన్ఆర్‌వై స్టేడియంలో మూడో టీ20, రెండో వన్డే జరగనున్నాయి. తొలి టెస్టు నవంబర్ 19న బేసిన్ రిజర్వ్‌లో ప్రారంభమవుతుంది. భారత పర్యటనపై అభిమానుల్లో ఉన్న ఉత్సాహమే రికార్డు విక్రయాలకు కారణమని న్యూజిలాండ్ క్రికెట్ చీఫ్ మార్కెటింగ్ అండ్ కమర్షియల్ ఆఫీసర్ గ్లెన్ క్రిట్చ్లీ తెలిపారు. గత సీజన్‌లో ఉన్న ధరలనే కొనసాగించామని చెప్పారు. క్రికెట్ నేషన్ కోడ్‌తో ఒక్కో టికెట్ ధర 30 న్యూజిలాండ్ డాలర్లలోపే ఉంటుందని వెల్లడించారు. సెప్టెంబర్ 7 నుంచి సాధారణ టికెట్ విక్రయాలు ప్రారంభమవుతాయి. క్రికెట్ నేషన్‌లో సభ్యత్వం తీసుకున్న అభిమానులు ముందస్తు విక్రయాల్లో పాల్గొనవచ్చు. వారికి టికెట్లపై 15 శాతం రాయితీ లభిస్తుంది. పలు మ్యాచ్‌లకు హాజరయ్యేవారి కోసం 'ది ఫోర్', 'ది సిక్స్' గ్రూప్ టికెట్ ప్యాకేజీలను కూడా అందుబాటులో ఉంచారు.

## టీ20లో గోల్డెన్ హ్యాట్రిక్..

### తొలి మూడు బంతులకు మూడు వికెట్లు

తమిళనాడు ప్రీమియర్ లీగ్ (టీఎన్‌పీఎల్)లో బుధవారం అద్భుతం చోటుచేసుకుంది. కేవలం మూడు బంతుల్లోనే మూడు వికెట్లు పడిపోయాయి. పైగా ముగ్గురు బ్యాటర్లు ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరారు. కోవై కింగ్స్‌తో క్వాలిఫయర్-2లో ట్రిచీ గ్రాండ్ చోళాస్ బ్యాటింగ్‌లో ఈ షాకింగ్ ఘటన జరిగింది. 184 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ట్రిచీకి కె. దీబన్ లింగేశ్ తొలి ఓవర్లోనే చుక్కలు చూపించాడు. మొదటి మూడు బంతుల్లోనే కె. రాజ్‌కుమార్, ఎస్. శ్యామ్ సుందర్, జగన్నాథన్ కౌశిక్‌లను ఔట్ చేశాడు. ముగ్గురూ డకౌట్ కావడంతో ట్రిచీ ఆరంభంలోనే కుప్పకూలింది. ఈ ప్రదర్శనతో దీబన్ లింగేశ్ టీఎన్‌పీఎల్ చరిత్రలో అరుదైన రికార్డు సృష్టించాడు. లీగ్‌లో గోల్డెన్ హ్యాట్రిక్ సాధించిన తొలి బౌలర్‌గా నిలిచాడు. అంటే వరుసగా మూడు బంతుల్లో మూడు వికెట్లు తీయడంతో పాటు, ఆ ముగ్గురు బ్యాటర్లు కూడా సున్నాకే వెనుదిరిగారు. ట్రిచీ ఇన్నింగ్స్‌లో మరో రెండు డకౌట్లు కూడా నమోదయ్యాయి. మణిమారన్ సిద్ధార్థ్ జాఫర్ జమాల్‌ను ఔట్ చేశాడు. ఆ తర్వాత ఆర్. దివాకర్ అధిసయరాజ్ డేవిడ్‌సన్‌ను పెవిలియన్‌కు పంపాడు. చివరికి ట్రిచీ 99 పరుగులకే ఆలౌటైంది. సిద్ధార్థ్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో ఐడ్రీమ్ తిరుప్పూర్ తమిళన్స్ టీఎన్‌పీఎల్ 2026 ఫైనల్‌కు చేరింది. ఆగస్టు 28న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో మదురై పాంథర్స్‌తో టైటిల్ పోరులో తలపడనుంది.



# సినిమా విజయం చిత్ర పరిశ్రమలో అందరిది

## ఇరుడముడికి చిరంజీవి ప్రత్యేక అభినందనలు

ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది 'ఇరుముడి'. రవితేజ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాపై ఇప్పటికే పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపించగా.. తాజాగా అగ్ర కథానాయకుడు చిరంజీవి ఈ హిట్ సినిమాపై రివ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పెట్టిన క్యాప్షన్ ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. ఒక సినిమా విజయం సాధిస్తే పరిశ్రమలో అందరికీ పండగే అని చెప్పిన చిరు.. 'ఈ పరిశ్రమ అందరిది.. ఏ కొందరిదో కాదు. మనం బతకాలి.. ఇతరులనూ బతికించాలి' అని పేర్కొన్నారు. ఇక 'ఇరుముడి' చిత్రబృందానికి చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన సోదరుడు రవితేజకు అభినందనలు. సినిమాను మొదటి నుంచి చివరి వరకు పూర్తిగా ఆస్వాదించా. రవితేజ అద్భుతంగా నటించాడు. ఈ సినిమా బాధ్యతను దర్శకుడు శివ నిర్వాణ తన భుజాలపై వేసుకుని గొప్పగా తీర్చిదిద్దారు. సున్నితమైన భావోద్వేగాన్ని ఆవిష్కరించిన తీరు బాగుంది. బాలనటి నక్షత్రకు గొప్ప భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నా. 'ఇరుముడి'లో భాగమైన నటీనటులకు, టెక్నీషియన్స్‌కు, నిర్మాతలకు ప్రత్యేక అభినందనలు' అని చిరు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ చిత్ర విజయం అర్థమైనదని పేర్కొన్నారు. చిరు పోస్ట్‌పై రవితేజ స్పందించారు. 'అన్నయ్యా థాంక్యూ..' అంటూ హార్ట్ ఎమోజీలను జోడించి కృతజ్ఞతలు చెప్పారు. విడుదలైన నాటి నుంచి థియేటర్స్ హౌస్ ఫుల్‌తో కళకళలాడుతుండగా, ఆరో రోజు కూడా అదే జోరు కొనసాగింది. కొన్ని థియేటర్‌లలో ప్రస్తుతం ఉన్న సినిమాను తీసేసి 'ఇరుముడి' వేయాలంటూ పలువురు ప్రేక్షకులు ఆందోళన చేస్తున్నారు. మరికొన్ని చోట్ల సీట్లు సరిపోక కుర్చీలు తెచ్చుకుంటున్నారు. కొన్ని హాళ్లలో ఏకంగా భజనలు చేస్తున్నారు. ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




# మరోమారు సుక్కుతో రామ్‌చరణ్ జోడీ

## రంగస్థలంను మించి ఉంటుందంటూ ప్రచారం

టాలీవుడ్ నుంచి రాబోతున్న అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా కూడా ఒకటి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' టాలీవుడ్‌లో ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ హిట్ కాంబినేషన్ మరోసారి జతకట్టబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'తో భారీ విజయాన్ని అందుకోగా, మరోవైపు సుకుమార్ 'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేశారు. తమ తమ కెరీర్‌లో భారీ విజయాల తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేయబోతుండటం ఈ ప్రాజెక్ట్‌పై మరింత హైప్‌ను పెంచుతోంది. అంతేకాదు, 'రంగస్థలం' వంటి ఐకానిక్ సినిమాను అందించిన కాంబినేషన్ కావడంతో ఈసారి ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సుకుమార్ మార్క్ కథనం, రామ్ చరణ్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ మరోసారి కలిస్తే బాక్సాఫీస్ వద్ద మరో భారీ సంచలనం నమోదవుతుందని అభిమానులు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నిర్మాత రవి శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ కాంబినేషన్‌పై అభిమానులు ఎంతటి అంచనాలు పెట్టుకున్నా, వాటిని మించే స్థాయిలో సినిమా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. సినిమా టైటిల్, కథాంశం, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తాజా టాక్ ప్రకారం, ఈ భారీ ప్రాజెక్ట్ షూటింగ్ ఈ ఏడాది నవంబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం రామ్ చరణ్, సుకుమార్ ఇద్దరూ తమ తమ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నేపథ్యంలో, ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ ఎలా ఉండబోతుందనేది కూడా ఆసక్తికరంగా మారింది.






# అల్లు అర్జున్‌కు అరుదైన గౌరవం

## ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన హీరో

అగ్రకథానాయకుడు అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా 'షోస్టాపర్స్ 2026' ప్రత్యేక సంచిక కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ప్రస్తుత పరిస్థితులు, సినిమాలో కథ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. బాలీవుడ్, దక్షిణాది సినిమా లేదా మరే ఇతర ప్రాంతీయ సినిమా అయినా సరే.. బాక్సాఫీస్ వద్ద ఆదరణ పొందాలంటే కథే ప్రధానం. మంచి కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా హిట్ అవుతుంది. కొత్త కథను ప్రేక్షకులకు అందించడమే అన్నిటికంటే ముఖ్యం' అని అల్లు అర్జున్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సినిమాల్లోని నటీనటుల స్టార్‌డమ్ కంటే కూడా సరైన కథే చిత్ర విజయాన్ని నిర్ణయిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు సినిమాలు, ఓటీటీ, క్రీడలు, సంగీతం, టెలివిజన్.. ఇలా వివిధ రంగాల్లో ప్రభావం చూపిన 100 మంది తారల జాబితాను 'షోస్టాపర్స్' పేరుతో ఫోర్బ్స్ ఇండియా తాజాగా విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో ఇండస్ట్రీకి చెందిన పలువురు నటీనటులు చోటు దక్కించుకున్నారు. అల్లు అర్జున్‌తో పాటు అమితాబ్ బచ్చన్, మోహన్ లాల్, రజనీకాంత్, రామ్ చరణ్, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్, ఏఆర్ రెహమాన్, బాబీ దేవోల్, దుల్కర్ సల్మాన్, మాధవన్, రణ్‌వీర్ సింగ్, రిషబ్ శెట్టి, కల్యాణి ప్రియదర్శన్, కంగనా రనౌత్ ఇందులో ఉన్నారు.

# రణబాలి రిలీజ్ అక్టోబర్ 16కు మార్పు

రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' పై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్, గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. భారీ యాక్షన్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా ఈ సినిమాను సెప్టెంబర్ 11 ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాలతో విడుదలను వాయిదా వేశారు.తాజాగా 'రణబాలి' కొత్త రిలీజ్ డేట్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 16న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ లుక్‌తో కూడిన కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. పోస్టర్‌లో కనిపిస్తున్న ఇంటెన్స్ లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. కొత్త రిలీజ్ డేట్ ప్రకారం దసరా సీజన్‌కు దగ్గరగా 'రణబాలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. పండుగ సెలవులు, భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరో సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్‌పై మేకర్స్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే తేదీకి సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్ 2' కూడా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఆసక్తికరమైన బాక్సాఫీస్ క్లాష్‌కు తెరలేచింది. ఒకవైపు విజయ్ దేవరకొండకు తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ ఇండియా, ఇతర భాషల్లోనూ మంచి మార్కెట్ ఉంది. మరోవైపు రజినీకాంత్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ బేస్ ఉండటంతో ఈ రెండు సినిమాల పోటీపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. 'రణబాలి'ని సాధారణ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా కాకుండా భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. 19వ శతాబ్దం నేపథ్యంలో కథ సాగుతుంది. ముఖ్యంగా బ్రిటిష్ పాలన కొనసాగుతున్న సమయంలో 1854 నుంచి 1878 మధ్య జరిగిన చారిత్రక పరిణామాలను ఆధారంగా చేసుకుని ఈ కథను రూపొందిస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. విజయ్ దేవరకొండ ఈ సినిమాలో ఇంతకుముందెన్నడూ చూడని విధమైన పాత్రలో కనిపించనున్నారని టాక్. పీరియాడిక్ ప్రపంచం, భారీ యాక్షన్ సన్నివేశాలు, అప్పటి కాలానికి సంబంధించిన సెట్స్, విజువల్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది.

# రకుల్ నోట శూర్పణఖ కథ.. తెలియని విషయాలు బయటపెట్టిన నటి!

రామాయణంలో శూర్పణఖ అంటే చాలామందికి వెంటనే గుర్తుకొచ్చేది ప్రతినాయకురాలి పాత్రే. కానీ, 'రామాయణ' చిత్రంలో తాను పోషిస్తున్న శూర్పణఖ పాత్రలో అంతకుమించిన కోణాలున్నాయని నటి రకుల్ ప్రీత్ సింగ్ చెప్పింది. ఆ పాత్రలోని అనేక అంశాలు తనను ఈ సినిమా వైపు ఆకర్షించాయని తెలిపింది. రావణుడి సోదరిగా శూర్పణఖ పాత్రలో రకుల్ కనిపించనుంది. లంకలో అత్యంత అందమైన మహిళల్లో ఆమె ఒకరని చెబుతారని రకుల్ గుర్తుచేసుకుంది. ఆమెకు అహంకారం ఉన్నప్పటికీ.. పాత్రలో చాలా కోణాలున్నాయని చెప్పింది. నటిగా అలాంటి పాత్రలను ఆవిష్కరించడం ఆసక్తికరంగా ఉంటుందని తెలిపింది. స్క్రిప్ట్ చదివే వరకు శూర్పణఖ జీవితం గురించి తనకు తెలియని విషయాలు చాలానే ఉన్నాయని రకుల్ చెప్పింది. లక్ష్మణుడు ఆమె ముక్కు కోసిన ఘటనకు ముందు, తర్వాత జరిగిన పరిణామాలను సినిమాలో కొత్త కోణంలో చూపిస్తున్నట్లు వెల్లడించింది. రాముడిని శూర్పణఖ ఎలా కలుస్తుందన్న విషయాల్లోనూ కొత్త అంశాలు తెలుసుకున్నానని తెలిపింది. రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, సన్నీ డియోల్, రవి దూబే కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం భారీ అంచనాల మధ్య తెరకెక్కుతోంది. 'రామాయణ: పార్ట్-1' 2026 నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342